

"జీవితంలో ఇక సాధ్యం కాకపోవచ్చనే కోరిక, సాకారమైందనే సంతోషం కలుగుతూ ఉంది. ఫిలాసఫీలో పీజీ వల్ల చాలా సంతృప్తిని పొందాను. పీజీ కోర్సులో కొన్ని పుస్తకాలు నన్ను బాగా ఆకట్టుకున్నాయి. జిడ్డు కృష్ణమూర్తి రాసిన 'నీవే ప్రపంచం', ఎస్.రాధాకృష్ణన్ 'ఇండియన్ ఫిలాసఫీ', టీఎంపీ మహదేవన్ రాసిన 'అద్వైత తత్త్వం', ఫ్రాంక్ థిల్లీ రాసిన 'పాశ్చాత్య తత్త్వశాస్త్ర చరిత్ర', ఓషో 'ధ్యానం', 'ప్రేమ' వంటి గ్రంథాలు చదివాను. జిడ్డు కృష్ణమూర్తి తత్త్వాన్ని చదివినప్పుడు చాలా సంఘర్షణకు లోనయ్యాను. 'దేవుడు అనే నమ్మకంతో సత్యాన్ని తెలుసుకోలేరు' అనడం.. గురుత్వాన్ని తిరస్కరించడం నన్ను బాగా ఆలోచింపజేశాయి."

ఏడు పదుల విద్యార్థి

ఎస్వీయూలో ఎంఏ ఫిలాసఫీ చదువుతున్న రాజేంద్రబాబు

తిరుపతి (విశ్వవిద్యాలయాలు), ఆంధ్రజ్యోతి

'అప్పట్లో ఫలానా డిగ్రీ చేయాలనుకున్నాను.. పరిస్థితుల వల్ల ఆపేయాల్సి వచ్చింది.' అని విచార జ్ఞాపకాలను మనుమలతో పంచుకుంటూ ఉంటారు చాలా మంది. 'నా కోరిక తీరనే లేదు.. మీరైనా చదువుకోండి' అని సలహా కూడా ఇస్తుంటారు. ఈయన మాత్రం ఆ బాపతు కాదు. రిటైరయ్యాక కృష్ణా..రామా అనుకుంటూ గడిపేయాలని అనుకోలేదు. నలభై ఏళ్ల కిందట నిలిచిపోయిన పీజీ చదువును ఏడు పదుల వయసులో కొనసాగిస్తున్నారు. అదీ ప్రయివేటుగా కాదు రెగ్యులర్ విద్యార్థిగా.

ఎస్వీ యూనివర్శిటీ ప్రాంగణంలో సైకిలు మీద దూసుకుపోతూ కనిపించే ఈయనను.. 'వ్యాయామం కోసం సైకిల్ తొక్కుతున్న పెద్దాయన' అనుకుంటారు చాలామంది.

లైబ్రరీలో పుస్తకాలు వెతుక్కుంటూ కనిపిస్తే.. 'ఎవరో పఠనాసక్తి మెండుగా గల మనిషి' అనీ అనుకుంటారు.

యూనివర్సిటీ టీచర్ల గదుల్లో కనిపిస్తుంటే.. 'వారి బంధుమిత్రులెవరో' అనుకుంటారు.


నిజానికి ఈయన ఎస్వీ యూనివర్సిటీలో తత్వశాస్త్రంలో పీజీ విద్యార్థి. పేరు రాజేంద్రబాబు. వాణిజ్య పన్నుల శాఖ అధికారిగా రిటైరయ్యాక పీజీలో చేరారు. కార్వేటినగరం మండలం కుమ్మరగుంటకు చెందిన రాజేంద్రబాబు ఎన్ఆర్ కండ్రిగలో ప్రాథమిక విద్య చదివారు. కత్తెరపల్లె, కార్వేటినగరంలలో హైస్కూలు చదువు సాగింది. టెన్త్‌లో స్కూల్ ఫస్ట్. తిరుపతిలోని ఎస్వీ జూనియర్ కాలేజీలో ఇంటర్మీడియట్, ఎస్వీ ఆర్ట్స్ కాలేజీలో డిగ్రీ పూర్తి చేశారు. 1977లో ఎస్వీ యూనివర్సిటీలో ఎంఏ ఫిలాసఫీలో చేరారు కానీ చదువు సాగలేదు. ఇంటి దగ్గర వ్యవసాయ పనుల భారం పడింది. చదువు మధ్యలో వదిలేసి ఇంటి బాట పట్టారు. సేద్యం చేసుకుంటూనే పోటీ పరీక్షలు రాయడం మొదలు పెట్టారు. 1980లో రైల్వే సర్వీసు పరీక్షల్లో ఉద్యోగానికి ఎంపికయ్యారు. ఏపీపీఎస్సీ పరీక్షల్లోనూ నెగ్గడంతో రాష్ట్ర ప్రభుత్వ ఉద్యోగిగా మారారు. వాణిజ్య పన్నుల శాఖలో చేరారు. ఉద్యోగం చేస్తూనే 1986లో దూరవిద్య ద్వారా బీఈడీ చేశారు. ఆగిపోయిన పీజీ చదువు పూర్తి చేయాలనే కోరిక ఉండిపోయింది. ప్రయివేటుగా చేసే అవకాశం ఉన్నా యూనివర్సిటీ కేంపస్‌లో చదవడం అనే ఫీలింగ్ రాదు. అది కలగానే ఉండిపోయింది. 2016లో అసిస్టెంట్ కమర్షియల్ ట్యాక్స్ ఆఫీసర్‌గా ఉద్యోగ విరమణ పొందిన రాజేంద్రబాబు.. తన కలకు రెక్కలు తొడిగారు. రామచంద్ర మిషన్ నిర్వహిస్తున్న హార్ట్‌ఫుల్‌నెస్ ధ్యాన కేంద్రంలో చేరి తత్త్వశాస్త్ర గ్రంథాలను చదవడం మొదలు పెట్టారు. ఆ పుస్తకాలు చదువుతూ ఉంటే తాను వదిలిపెట్టిన ఎంఏ ఫిలాసఫీ కోర్సు పూర్తి చేయాలనిపించింది. పీజీలో రెగ్యులర్ విద్యార్థిగా చేరిపోయారు. క్రమశిక్షణగా తరగతులకు హాజరవుతారు. సందేహాలుంటే టీచర్లను అడుగుతారు. లైబ్రరీకి వెళ్లి పుస్తకాలు రెఫర్ చేస్తారు. రాజేంద్రబాబు తల్లి కృష్ణమ్మకి వందేళ్లు. పల్లెలోనే ఉంటుంది. భార్య సుమతి పోర్చుగల్‌లో ఛార్టెడ్ అకౌంటెంట్‌గా పని చేశారు. కుమార్తె చాందినికి వివాహం అయ్యింది. ఇంటి నుంచి ఐదు కిలోమీటర్ల దూరం.. రోజూ సైకిలు మీదనే యూనివర్సిటీకి హాజరవుతారు. విశ్రాంత జీవితాన్ని అర్థవంతంగా మలచుకున్న రాజేంద్రబాబు వయసు కేవలం ఒక సంఖ్య మాత్రమే అని నిరూపిస్తున్నారు. పీజీ పూర్తయ్యాక ధ్యానంపై విదేశీ విశ్వవిద్యాలయాల్లో పీహెచ్‌డీ చేయాలన్నది ఈయన లక్ష్యం. అదీ సాధించగలననే ఆత్మవిశ్వాసంతో ఉన్నారు రాజేంద్రబాబు.

మా మంచి విద్యార్థి



క్రమం తప్పకుండా యూనివర్సిటీకి వస్తారు. అందరు విద్యార్థులతో కలిసిపోతారు. శ్రద్ధగా కొత్త కొత్త పుస్తకాలను చదువుతారు. సందేహాలను నివృత్తి చేసుకుంటూ ఉంటారు. ఫిలాసఫీపై రాజేంద్రబాబు పట్టు సాధించారు. ఆయనకున్న ఆసక్తి చూస్తే ఆశ్చర్యం, ఆనందం కలుగుతాయి.

- డాక్టర్ నాగలూరి దయాకర్, అధ్యాపకుడు, ఫిలాసఫీ విభాగం, ఎస్వీయూ





గతంలో నిర్మాణంలో ఉన్న ఒబెరాయ్ హోటల్ (ఫైల్ ఫొటో)

అరవింద్ పక్కన ఒబెరాయ్‌కి భూములు

- హయత్‌కు శిల్పారామంలో
- ప్రభుత్వం నిర్ణయం

తిరుపతి, ఏప్రిల్ 26 (ఆంధ్రజ్యోతి): హిందూ సంస్థల వ్యతిరేకతతో అలిపిరి సమీపంలో భూములు రద్దు చేసిన ఒబెరాయ్ సంస్థకు ప్రత్యామ్నాయంగా అరవింద్ కంటి ఆసుపత్రి పక్కన 35 ఎకరాలు కేటాయించాలని ప్రభుత్వం నిర్ణయించింది. అలాగే హయత్ హోటల్‌కు శిల్పారామంలో మూడు ఎకరాలు కేటాయించేందుకు నిర్ణయించింది. దీనికి సంబంధించిన ప్రభుత్వ ఉత్తర్వులు వెలువడాల్సి ఉంది. ఒబెరాయ్ తమకు కేటాయించిన భూమిలో ఇప్పటికే నిర్మాణాలు కూడా దాదాపుగా చేసినా, వాటిని టీటీడీకి ప్రభుత్వం అప్పగించనుంది. తిరుపతిలోని అలిపిరి-చెర్లోపల్లి మార్గంలో వైసీపీ ప్రభుత్వం ఒబెరాయ్ సంస్థకు హోటల్ నిర్మాణానికి భూమి కేటాయించింది. ఆ సంస్థ తాజ్ గ్రూప్ పేరిట నిర్మాణం మొదలు పెట్టడంతో హిందూ సంస్థలు అభ్యంతరం తెలిపాయి. బీజేపీ సహా పలు హిందూ మత సంస్థలు, స్వామీజీలు అలిపిరి కొండ సమీపంలో హోటల్ నిర్మాణానికి వ్యతిరేకంగా ఆందోళన చేపట్టాయి. దీంతో ప్రభుత్వం పునరాలోచనలో పడింది. ఇటీవల తిరుమలకు వచ్చిన సందర్భంగా సీఎం చంద్రబాబు ఒబెరాయ్‌తో పాటు ఇతర హోటళ్లకు గత ప్రభుత్వం జరిపిన భూ కేటాయింపులను రద్దు చేస్తున్నట్టు ప్రకటించారు. వాస్తవానికి పేరూరు గ్రామ పరిధిలోని ఆ భూములన్నీ రెవెన్యూకు చెందినవైనప్పటికీ తిరుమల పాదాల చెంత అలిపిరి టోల్‌గేట్‌కు చేరువలో ఉన్నందున వాటిని టీటీడీకి అప్పగించనున్నట్టు తెలిపారు. అయితే అప్పటికే ఒబెరాయ్ సంస్థ సుమారు రూ.35 కోట్ల విలువైన నిర్మాణాలు చేపట్టింది. వైష్ణవి సంస్థ కూడా కొంత మేరకు నిర్మాణాలు జరిపింది. హయత్ హోటల్‌కు భూమి కేటాయించినా చదును చేశారు తప్ప పనులేవీ మొదలు కాలేదు. ఆ దశలో భూముల కేటాయింపు రద్దు చేసిన ప్రభుత్వం వాటికి ప్రత్యామ్నాయ కేటాయింపులు జరిపేందుకు శ్రీకారం చుట్టింది. ప్రత్యామ్నాయంపై త్వరగా నిర్ణయం తీసుకోకపోతే రాష్ట్రంలో పెట్టుబడులకు అవరోధం ఏర్పడుతుందని భావిస్తున్నారు. అందులో భాగంగా ఒబెరాయ్ హోటల్‌కు అదే అలిపిరి-చెర్లోపల్లి మార్గంలో అరవింద్ కంటి ఆస్పత్రి పక్కన టీటీడీకి చెందిన 35 ఎకరాల భూమిని కేటాయించేందుకు నిర్ణయం తీసుకుంది. ఇదివరకూ ఒబెరాయ్‌కు కేటాయించిన భూములకు ఎదురుగానే తాజాగా భూములు కేటాయిస్తున్నారు. అలాగే హయత్ సంస్థకు శిల్పారామంలో నిరుపయోగంగా ఉన్న మూడు ఎకరాల భూమిని కేటాయించేందుకు నిర్ణయం తీసుకున్నారు. త్వరలో ఈ రెండు భూ కేటాయింపులపై ప్రభుత్వం నుంచి ఉత్తర్వులు వెలువడనున్నాయి.

దాటి మాటినా వెంటాడిన మృత్యువు

- గజదాడికి బలైన సిద్ధయ్యకు రూ.10 లక్షల పరిహారం




సిద్ధయ్య మృతదేహం

ఎర్రావారిపాలెం, ఏప్రిల్ 26(ఆంధ్రజ్యోతి):ఏనుగు బారిన పడకుండా మరోమార్గంలో వెళ్లినా మృత్యువు ఆ రైతును వెంటాడింది. చిన్నగొట్టిగల్లు మండలం చిట్టేచెర్ల పంచాయతీ దాసరిగూడేనికి చెందిన రొడ్డా సిద్ధయ్య శుక్రవారం రాత్రి ఏనుగు దాడిలో మృతి చెందిన విషయం తెలిసిందే. ఆరు నెలలుగా భాకరాపేట, ఎగవూరు, చిట్టెచెర్ల పంచాయతీల్లో ఒంటరి ఏనుగు సంచరిస్తోందని రైతులు గుర్తించారు.అయితే మూడు రోజులుగా బోడేవాండ్లపల్లె-ఉక్కావాండ్లపల్లె మధ్య పొంతలకుంట మామిడి తోటల్లో రెండు ఏనుగులు తిష్ట వేశాయి. ఈ విషయం ఈ ప్రాంత రైతులకు తెలియలేదు. శుక్రవారం రాత్రి ఇందులో ఒక ఏనుగు చిట్టేచెర్ల క్రాస్, కుమ్మరపల్లె, మఠం గొల్లపల్లె ప్రాంతాల్లో సంచరించి రాత్రి జంగమాల కొండ వద్ద ఎరప చెరువుకు చేరుకుంది. మరో ఏనుగు పొంతల కుంట నుంచి కొత్తపల్లె దేవరకొండ రోడ్డు మీదుగా ఎరప చెరువు వద్ద ఉన్న సహచర ఏనుగు వద్దకు వెళుతోంది.సిద్ధయ్య కూరగాయలు కోసుకొని ఒంటరి ఏనుగు బారిన పడకూడదని దేవర కొండ రోడ్డు మార్గాన బయలుదేరి కొత్తపల్లె సమీపాన రెండో ఏనుగుకు దొరికిపోయాడు. ఏనుగు దాడిలో మరణించారు. ఎప్పటిలా ఏనుగులను తరిమేందుకు అర్ధరాత్రి వచ్చిన భాకరాపేట ఫారెస్టు అధికారులు విగతజీవిగా పడి వున్న సిద్ధయ్యను గుర్తించారు. కాగా, మృతుడి కుటుంబానికి ప్రభుత్వం రూ.10 లక్షల పరిహారం ప్రకటించింది.

14సంవత్సరాల్లో 42మంది బలి

ఎర్రావారిపాలెం, ఏప్రిల్ 26 (ఆంధ్రజ్యోతి):ఉమ్మడి చిత్తూరు జిల్లాలో గత 14 ఏండ్లలో 42మంది గజదాడులకు బలైపోయారు.వీరిలో కొద్దిమంది మినహా ఆరుగాలం కష్టించి సాగుచేసిన పంటలను రక్షించుకునే క్రమంలో ప్రాణాలు పోగొట్టుకున్న రైతులే వున్నారు. గజదాడులకు బలైన రైతుల్లో వెంకటేశులు,గంగులప్ప, సోనియా,వెంకటప్ప,ఉష,శివలింగం(కుప్పం మండలం), తిమ్మప్ప నాయుడు(గుడుపల్లె),కన్నానాయక్, రెడ్యా నాయక్, చిన్నబ్బ(రామకుప్పం),రామిరెడ్డి,ఆరేటయ్య, గంగులయ్య, వెంకట్రమణ (ఎర్రావారిపాలెం),వెంకట్రామయ్య (రామ సముద్రం), తుపాకుల చిన్నబ్బ(పుత్తూరు),మార్కొండేయ, బంగారప్ప(పెద్ద పంజాణి),చిన్నబ్బ(బంగారుపాళ్యం),ఎల్లప్ప (సదుం), వెంకటేశు,సెల్వికార్తీక్,వసంత(గుడిపాల), మస్తాన్ (పులిచెర్ల), కణ్ణన్, రాకేష్ నాయుడు(చంద్రగిరి), చిన్న రాజారెడ్డి(పీలేరు), రొడ్డా సిద్ధయ్య(చిన్నగొట్టిగల్లు మండలం)తో పాటు యాదమరి మండలం దళవాయి పల్లెకు చెందిన ఇద్దరు,పలమనేరు మండలానికి చెందిన నలుగురు వున్నారు.ఫారెస్టు ప్రొటెక్షన్ వాచర్లు మరో నలుగురు కూడా గజదాడులకు బలైపోయారు.శివరాత్రి ఉత్సవాలకు తలకోన వస్తుండగా రైల్వేకోడూరుకు చెందిన ముగ్గురిని కూడా ఏనుగులు తొక్కి చంపేశాయి.

8న ముఖ్యమంత్రి రాక



శ్రీసిటీలో ఎల్జీ పరిశ్రమకు శంకుస్థాపన

ప్రాథమికంగా ఖరారైన పర్యటన

తిరుపతి, ఏప్రిల్ 26 (ఆంధ్రజ్యోతి): సీఎం నారా చంద్రబాబు నాయుడు వచ్చే నెల 8న జిల్లాకు రానున్నారు. శ్రీసిటీలో ఎల్జీ పరిశ్రమ నిర్మాణానికి శంకుస్థాపన చేయనున్నారు. ఈ మేరకు ప్రాథమికంగా సీఎం పర్యటన షెడ్యూలు ఖరారైందని కలెక్టర్ డాక్టర్ సంజామల వెంకటేశ్వర్ శనివారం వెల్లడించారు. శ్రీసిటీలో భూములు కేటాయిస్తే రూ.5,001 కోట్ల పెట్టుబడితో మూడు దశల్లో ఏసీలు, రిఫ్రిజిరేటర్లు తయారు చేసే ప్లాంట్ నెలకొల్పుతామని ఎల్జీ సంస్థ గతేడాది ప్రభుత్వానికి ప్రతిపాదనలు పంపిన సంగతి తెలిసిందే. ఈ ప్లాంట్ ద్వారా 1,495 మందికి ఉద్యోగ ఉపాధి అవకాశాలు కల్పిస్తామని ఆ సంస్థ ప్రతిపాదించింది. దీంతో మూడు దశలకూ కలిపి శ్రీసిటీలో ఆ సంస్థకు 450 ఎకరాలు కేటాయించేందుకు ప్రభుత్వం గతేడాది నవంబరులో ఉత్తర్వులు జారీ చేసింది. దానితో పాటు అవసరమైన రాయితీలు, మినహాయింపులు సైతం ప్రకటించింది. తొలుత నిర్ణయించుకున్న షెడ్యూలు ప్రకారం ఎల్జీ సంస్థ ఈ ఏడాది జనవరిలోనే ప్లాంట్ నిర్మాణ పనులు ప్రారంభించాల్సి ఉంది. అయితే వివిధ కారణాలతో ఆలస్యమైంది. ప్రస్తుతం ఏర్పాట్లన్నీ పూర్తి కావడంతో సీఎం చంద్రబాబు చేతుల మీదుగా శంకుస్థాపన చేయించాలని సంస్థ ప్రతినిధులు నిర్ణయించారు. ఆ మేరకు ప్రభుత్వాన్ని అభ్యర్థించడంతో వచ్చే నెల 8వ తేదీన సీఎం చంద్రబాబు పర్యటన ప్రాథమికంగా ఖరారైంది. దానికనుగుణంగా జిల్లా యంత్రాంగం ఏర్పాట్లు చేస్తోంది.



కీర్తికుమార్

నీట్ సూపర్ స్పెషాలిటీలో..

గూడూరు డాక్టర్‌కు ఆలిండియా 132వ ర్యాంకు

గూడూరు, ఏప్రిల్ 26 (ఆంధ్రజ్యోతి): స్థానిక కరణాలవీధికి చెందిన డాక్టర్ పర్వత కీర్తికుమార్ నీట్ సూపర్ స్పెషాలిటీ ప్రవేశ పరీక్ష ఫలితాల్లో 132వ ర్యాంకు సాధించాడు. ఎండీ, ఎంఎస్ చేసిన వైద్యులు డీఎం, ఎంసీహెచ్ వంటి సూపర్ స్పెషాలిటీ కోర్సులను చేసేందుకు నీట్ సూపర్ స్పెషాలిటీ ప్రవేశ పరీక్షలు రాయాల్సి ఉంటుంది. వెంకటరమణయ్య, కోటేశ్వరి దంపతుల కుమారుడైన డాక్టర్ కీర్తికుమార్ స్థానిక ఏరియా ఆస్పత్రిలో సివిల్ అసిస్టెంట్ సర్జన్‌గా పనిచేస్తున్నారు. నీట్ సూపర్ స్పెషాలిటీ ప్రవేశ పరీక్ష రాయగా శుక్రవారం విడుదలైన ఫలితాల్లో ఆలిండియా స్థాయిలో 132వ ర్యాంకు సాధించాడు. పలువురు వైద్యులు, కుటుంబ సభ్యులు ఆయన్ను అభినందించారు.

మత్స్యకారులకు అండగా..

- వేట నిషేధ భృతి జమ

తిరుపతి(కలెక్టరేట్), ఏప్రిల్ 26(ఆంధ్రజ్యోతి): మత్స్యకారులకు ప్రభుత్వం అండగా నిలిచింది. చేపలవేట నిషేధ సమయంలో వారి కుటుంబాలు ఇబ్బంది పడకుండా శనివారం భృతి జమచేసింది. శ్రీకాకుళం జిల్లా బుడగట్లపాలెంలో సీఎం చంద్రబాబు పాల్గొని లబ్ధిదారులకు భృతి అందజేయగా కలెక్టరేట్‌లో ప్రజాప్రతినిధులు, అధికారులు, మత్స్యకారులు వర్చువల్ విధానంలో వీక్షించారు. అనంతరం కలెక్టరేట్‌లో సూళ్లూరుపేట ఎమ్మెల్యే నెలవల విజయశ్రీ, కలెక్టర్ వెంకటేశ్వర్ కలిసి సూళ్లూరుపేట, గూడూరు నియోజకవర్గాల పరిధిలో ఉన్న 3,947 మంది మత్స్యకారులకు రూ.7.89 కోట్ల చెక్కును మత్స్యకార నాయకులకు అందజేశారు. ఎమ్మెల్యే నెలవల మాట్లాడుతూ వేట నిషేధ సమయంలో ఇచ్చే మత్స్యకార భృతిని రూ.20 వేలు చేస్తామని ఇచ్చిన హామీని సీఎం చంద్రబాబు నిలబెట్టుకున్నారన్నారు. మత్స్యకారులకు వలలు, డీజిల్ సబ్సిడీపై అందజేస్తున్నామని చెప్పారు. పులికాట్ ముఖద్వారం, రోడ్లు, పాఠశాలల ఏర్పాటు వంటి సమస్యలను మత్స్యకార నాయకులు కలెక్టర్‌కు విన్నవించగా పరిష్కరిస్తామని హామీ ఇచ్చారు. ఆక్వా రైతులు తమ సమస్యలపై విన్నవించారు.



మత్స్యకార భరోసా చెక్కు అందజేస్తున్న ఎమ్మెల్యే నెలవల విజయశ్రీ, కలెక్టర్ వెంకటేశ్వర్

ఏడుగురు సీఐల బదిలీ | నలుగురు వీఆర్‌కు 8

బంగారు తిరుచ్చిపై కల్యాణ వెంకన్న కటాక్షం



చంద్రగిరి, ఏప్రిల్ 26(ఆంధ్రజ్యోతి): శ్రీనివాసమంగాపురంలో శనివారం సాయంత్రం బంగారు తిరుచ్చి వాహనంపై కల్యాణ వేంకటేశ్వరస్వామి భక్తులకు దర్శనమిచ్చారు. ఉదయం స్వామి వారి సుప్రభాత సేవతో మేల్కొలిపి, నిత్య కట్ల కైంకర్యాలు నిర్వహించారు. 10.30 గంటలకు శ్రీదేవి, భూదేవి సమేత కల్యాణ వేంకటేశ్వరస్వామి ఉత్సవర్లకు కల్యాణోత్సవం నిర్వహించారు. సాయంత్రం ఊంజల్ సేవ జరిగింది. అనంతరం ఉత్సవర్లను విశేషంగా అలంకరించి, బంగారు తిరుచ్చి వాహనంపై అధిష్ఠింపజేసి మాడవీధుల్లో ఊరేగించారు. ప్రత్యేక డిప్యూటీ ఈవో వరలక్ష్మి, ఏఈవో గోపినాథ్, సూపరింటెండెంట్లు వెంకటస్వామి, మునిచెంగల్రాయులు, అర్చకులు బాలాజీరంగాచార్యులు, శేషాద్రిచార్యులు, నారాయణాచార్యులు, పార్థసారథి, జమేదర్ చిరంజీవి, భక్తులు, సిబ్బంది పాల్గొన్నారు.

కోదండరామాలయానికి విరాళం



చంద్రగిరి, ఏప్రిల్ 26(ఆంధ్రజ్యోతి): స్థానిక కోదండరామాలయానికి దాతలు విరాళాన్ని అందజేసారు. చంద్రగిరికి చెందిన పాదిరి మునికృష్ణారెడ్డి, లక్ష్మి దంపతులు రూ.10166వి రాళంగా ఆలయ ఇన్‌స్పెక్టర్ మునిహరిబాబు, అర్చకులు శ్రీనివాసబట్టర్‌లకు అందజేశారు. ఈసందర్భంగా ఆలయ అధికారులు మాట్లాడుతూ కోదండరామాలయానికి భక్తులు నగదు విరాళంగా అందించవచ్చునని తెలిపారు.

మే 22 నుంచి అమ్మవారి వసంతోత్సవాలు

తిరుచానూరు, ఏప్రిల్ 28: పద్మావతి అమ్మవారి ఆలయంలో మే 22 నుంచి మూడు రోజుల పాటు వార్షిక వసంతోత్సవాలు నిర్వహించనున్నారు. ఈక్రమంలో 21వ తేదీ సాయంత్రం అంకురార్పణ నిర్వహిస్తారు. భక్తులు రూ.150 చెల్లించి వసంతోత్సవంలో పాల్గొనవచ్చు. 23వ తేదీ ఉదయం స్వర్ణ రథోత్సం జరగనుంది. వసంతోత్సవాలు జరిగే మూడు రోజులు మధ్యాహ్నం ఫ్రైడే గార్డెన్‌లో అమ్మవారి ఉత్సవర్లకు స్నపన తిరుమంజనం నిర్వహించనున్నారు. రాత్రి ఆలయ మాడవీధుల్లో పద్మావతిదేవి ఊరేగనున్నారు. పద్మావతివేది వార్షిక వసంతోత్సవాలను పురస్కరించుకుని మే 14న కోయిల్ ఆళ్వార్ తిరుమంజనం నిర్వహించనున్నారు. ఉత్సవాల కారణంగా మే 14తో పాటు 21 నుంచి 24వ తేదీ వరకు కల్యాణోత్సవం, సహస్ర దీపాలంకరణ, మే 23న తిరుప్పావడ సేవ, 24న లక్ష్మీపూజ ఆర్జిత సేవలను టీటీడీ రద్దు చేసింది.

పహల్గాం దాడిని నిరసిస్తూ ర్యాలీ



తీవ్రవాదుల దిష్టిబొమ్మను దగ్ధం చేస్తున్న రమణ, గ్రామస్థులు

తిరుచానూరు, ఏప్రిల్ 26(ఆంధ్రజ్యోతి): పాకిస్తాన్ ప్రేరేపిత తీవ్రవాదులందరినీ సర్జికల్ స్ట్రైక్ చేపట్టి అంతం చేయాలని సాయినగర్ సర్పంచ్ డీవీ రమణ అన్నారు. పహల్గాం దాడికి నిరసనగా సాయినగర్ నుంచి తిరుపతి బైరాగిపట్టెడ, కేశవాయనగుంట, బాబు జగజ్జీవన్‌రామ్ సర్కిల్ వరకు వివిధ వర్గాల ప్రజలు ర్యాలీగా వచ్చారు. మానవ హారంగా ఏర్పడ్డారు. తీవ్రవాదుల దిష్టిబొమ్మను దహనం చేశారు. ఈ సందర్భంగా రమణ మాట్లాడుతూ తీవ్రవాదులకు బుద్ధిచెప్పాల్సిన సమయం ఆసన్నమైందన్నారు. కార్యక్రమంలో బాబా విద్యానికేతన్ చైర్మన్ రమేష్‌బాబు, నారాయణ జూనియర్ కలాశాల ఏవోటి నాగరాజురెడ్డి, రాష్ట్ర రెడ్డి సంఘం ఉపాధ్యక్షులు దండు ధర్మారెడ్డి, సాయినగర్ ఉపసర్పంచ్ సోమశేఖర్‌రెడ్డి, హతీష్ రాయల్, వార్డు సభ్యులు దివ్యగిరి, శ్రీనివాసులు, జయముని, శ్యామలమ్మ, భారతమ్మ, పంచాయతీ సిబ్బంది, సచివాలయ సిబ్బంది, ప్రజలు విద్యార్థులు పెద్దసంఖ్యలో పాల్గొన్నారు.

కొత్త బీన్స్ వంగడాలపై రైతులకు అవగాహన



రైతులకు విత్తనాలు పంపిణీ చేస్తున్న శ్రీనివాసులు

భాకరాపేట, ఏప్రిల్ 26(ఆంధ్రజ్యోతి): ఖరీఫ్ రబీ సీజన్లో కొత్తగా అభివృద్ధి చేసిన లాంగ్ బీన్స్ వంగడాలను రైతులు సాగు చేయాలని రాస్ కేవీకే సీనియర్ శాస్త్రవేత్త శ్రీనివాసులు సూచించారు. చిన్నగొట్టిగల్లు మండలం బిల్లావాండ్లపల్లెలో కరకంబాడిలోని రాస్ కృషి విజ్ఞాన కేంద్రం ఆధ్వర్యంలో లాంగ్ బీన్స్ వంగడాల సాగు దిగుబడులపై అవగాహన కల్పించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ ఆర్కే మంగళం రకం బీన్స్ తీగజాతి వంటివని ఇది టమోటా తరహాలో సాగు చేసుకోవాలన్నారు. లాంగ్ బీన్స్ అనేది నూరు రోజుల లోపల దిగుబడి వస్తుందన్నారు. ఎస్సీ ఉప ప్రణాళిక కింద బీన్స్ విత్తనాలను రైతుకుల ఉచితంగా పంపిణీ చేశారు. ఉద్యాన శాస్త్రవేత్త సుధాకర్, రైతులు పాల్గొన్నారు.

ప్రాంగణ నియామకాలకు ఎస్డీహెచ్‌ఆర్ విద్యార్థుల ఎంపిక



ఎంపికైన విద్యార్థులతో ఎస్డీహెచ్‌ఆర్ డిగ్రీ కళాశాల చైర్మన్ చక్రవర్తిరెడ్డి

తిరుపతిరూరల్, ఏప్రిల్26(ఆంధ్రజ్యోతి): న్యూ బాలాజీకాలనీలోని ఎస్డీహెచ్‌ఆర్ డిగ్రీ, పీజీ కళాశాలలో పలు సంస్థలు నిర్వహించిన క్యాంపస్ ఇంటర్వ్యూలోల 215మంది విద్యార్థులు ఉద్యోగాలకు ఎంపికైనట్లు ప్రిన్సిపాల్ ఎ.ఉష పేర్కొన్నారు. కాగ్నిజంట్, ఆల్‌సెట్ బిజినెస్ సొల్యూషన్స్, ఒమేగా హెల్త్, ఏజీఎస్ హెల్త్, నోబ్రోకర్ సంస్థలు హాజరై ప్రాంగణ ఎంపికలు నిర్వహించారన్నారు. ప్రతిభచాటి ఉద్యోగాలకు ఎంపికైన విద్యార్థులను చైర్మన్ డీవీఎస్ చక్రవర్తిరెడ్డి అభినందించారు.

గురుకుల పాఠశాల విద్యార్థుల ప్రతిభ



రావిళ్ల లోకేశ్వరి

తిరుపతిరూరల్, ఏప్రిల్26(ఆంధ్రజ్యోతి): రూరల్ మండలం జూపార్క్‌రోడ్డులోని మహాత్మ జ్యోతిబాఫూలే వెనుకబడిన తరగతుల సంక్షేమ బాలికల గురుకుల పాఠశాల విద్యార్థులు ఇటీవల విడుదలైన పదవతరగతి ఫలితాల్లో మంచి మార్కులు సాధించి ప్రతిభచాటారని ప్రిన్సిపాల్ కె.రేష్మ పేర్కొన్నారు. రావిళ్ల లోకేశ్వరి 575మార్కులు, నాగళ్ల హాసిని 572, తలారి జ్ఞానప్రియ 569మార్కులతో వరుసగా తొలిమూడుస్థానాలు సాధించారన్నారు. వీరిని ప్రిన్సిపాల్, టీచర్లు అభినందించారు.

పాడి రైతుల అభివృద్ధికి కృషి



సమావేశంలో పాల్గొన్న అధికారులు

తిరుపతి రూరల్ ఏప్రిల్ 26(ఆంధ్రజ్యోతి): ప్రభుత్వం అందించే పలు పథకాలను క్షేత్రస్థాయిలో రైతుల దరికి చేర్చి పాడి పరిశ్రమ అభివృద్ధికి కృషి చేయాలని జిల్లా పశుసంవర్థక అధికారి డాక్టర్ రవికుమార్ తెలిపారు. ఎస్వీ వెటర్నరీ వర్సిటీ ఆడిటోరియంలో జిల్లా పశుసంవర్థక ఆధ్వర్యంలో శనివారం ప్రపంచ వెటర్నరీ దినోత్సవాన్ని నిర్వహించారు. ముఖ్యఅతిథిగా హాజరైన ఆయన మాట్లాడుతూ ప్రభుత్వం రైతుల అభివృద్ధికి అనేక పథకాలు రూప కల్పన చేస్తోందన్నారు.ఆధునిక సాంకేతిక పరిజ్ఞానాన్ని వినియోగించుకుని వారికి మెరుగైన సేవలు అందించాలని కోరారు. వెటర్నరీ వీసీ ప్రొఫెసర్ జేవీ రమణ మాట్లాడుతూ.. పాడి పరిశ్రమ అభివృద్ధిలో వెటర్నరీ వైద్యుల పాత్ర కీలకమన్నారు. వెటర్నరీ వైద్యుల సంఘ జిల్లా అధ్యక్షుడు డాక్టర్ సిహెచ్ కృష్ణారావు మాట్లాడుతూ.. ఖాళీగా ఉన్న పోస్టులను భర్తీ చేయాలని కోరారు. సాంస్కృతిక కార్యక్రమాలు అలరించాయి. క్రీడా పోటీల్లో ప్రతిభ చాటిన వారికి బహుమతులు ప్రధానం చేశారు. వెటర్నరీ డీన్ డాక్టర్ కె. వీర బ్రహ్మయ్య, అసోసియేట్ డీన్ ప్రొఫెసర్ పి జగపతి రామయ్య, వెటర్నరీ వైద్యులు పాల్గొన్నారు.

30 నుంచి స్లాట్ బుకింగ్ రిజిస్ట్రేషన్లు

పాకాల,ఏప్రిల్ (ఆంధ్రజ్యోతి): డిజిటల్ క్యూ మేనేజ్‌మెంట్ సిస్టమ్-స్లాట్ బుకింగ్ ద్వారా ఈ నెల 30 నుంచి సబ్‌రిజిస్ట్రర్ కార్యాలయంలో రిజిస్ట్రేషన్‌లు జరుగుతాయని సబ్‌రిజిస్ట్రార్ రహంతుల్లా శనివారం ఓ ప్రకటనలో తెలిపారు. స్లాట్ బుకింగ్ వెబ్‌సైట్ ద్వారా లేదా కార్యాలయంలో క్యూ ఆర్‌కోడ్ స్కాన్ చేసి ఈ ప్రక్రియ చేసుకోవచ్చన్నారు. ప్రజలు అపాయింట్‌మెంట్ తేదీ, సమయాన్ని బుక్ చేసుకోవచ్చన్నారు. క్యూలైన్‌లో వేచిఉండకుండా కొనుగోలుదారులు, అమ్మకందారులు, సాక్షులు సబ్‌రిజిస్ట్రార్ కార్యాలయానికి నిర్దేశిత స్లాట్ సమయానికి చేరుకోవాన్నారు. ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని ఆయన కోరారు.

షార్ట్ ఫిలిం నటులకు సన్మానం



తిరుపతి(కల్చరల్), ఏప్రిల్ 26(ఆంధ్రజ్యోతి): జెండా షార్ట్ ఫిలిం ఇటీవల నాలుగు అత్యుత్తమ పురస్కారాలను అందుకుంది. ఇందులో నటీనటులు తిరుపతి వారు కావడంతో శనివారం వారిని గోరా ఆధ్యాత్మిక సేవా కేంద్రం ఆధ్వర్యంలో సన్మానించారు. భారత జాతీయ పతాక రూపకర్త పింగళి వెంకయ్య జీవిత చరిత్రను చిత్రంగా తీసిన దర్శకుడు అచ్యుత్ కోవిదిని, లోకేష్, నవీన్, సందీప్, పవన్, దాసరి, అఖిలను సత్కరించారు. ఈ కార్యక్రమంలో రాయలసీమ రంగస్థల కళాకారుల సంఘం అధ్యక్షుడు గుండాల గోపీనాథ్‌రెడ్డి, బ్రాహ్మణ సేవా సంఘం శశిధర్‌రావు, జయలక్ష్మీ, డాక్టర్ స్వరాజ్యలక్ష్మి, చిత్రపు హనుమంతరావు తదితరులు పాల్గొన్నారు.

డాక్టరేట్ ప్రదానం



ఎం.శారద

తిరుపతి (విశ్వవిద్యాలయాలు), ఏప్రిల్ 26 (ఆంధ్రజ్యోతి): పద్మావతి యూనివర్సిటీ లా పరిశోధకురాలు ఎం.శారద డాక్టరేట్ పొందారు. 'ఈ-వేస్ట్ మేనేజ్‌మెంట్ ఇన్ ఎన్విరాన్‌మెంట్ కన్జర్వేషన్ ఎ స్టడీ' అనే అంశంపై ప్రొఫెసర్ కె. సునీత పర్యవేక్షణలో పరిశోధన పూర్తి చేశారు.

మహిళకు తీవ్రగాయాలు

నాయుడుపేట టౌన్, ఏప్రిల్ 26 (ఆంధ్రజ్యోతి): నాయుడుపేట విన్నమాల జాతీయ రహదారి సమీపంలో లారీ ఢీకొని మహిళకు తీవ్ర గాయాలయ్యాయి. నెల్లూరు పట్టణానికి చెందిన నవ్య స్కూటీలో వెళుతుండగా నాయుడుపేట జాతీయ రహదారి సమీపంలో లారీలో ఇనుప ఊచలు మహిళ తలకు తగలడంతో గాయాలయ్యాయి. క్షతగాత్రురాలు అపస్మారక స్థితిలోకి వెళ్లింది. ఆమెను నాయుడుపేట ప్రభుత్వాస్పత్రికి తరలించారు.

మఠం భూమి ఆక్రమణకు అడ్డుకట్ట

తిరుపతి(కల్చరల్), ఏప్రిల్ 26(ఆంధ్రజ్యోతి): తిరుపతి ఏఆర్ బైపాస్ రోడ్డులోని హథీరాంజీ మఠానికి సంబంధించిన భూ ఆక్రమణను మఠం అధికారులు అడ్డుకున్నారు. గతంలో ప్రహరీ నిర్మాణంపై ఈస్ట్ పోలీస్ స్టేషన్‌లో కేసు నమోదైంది. తాజాగా మఠం భూమిని ఆక్రమిస్తున్నారని సమాచారంతో మరోసారి అడ్డుకున్నారు. ఆక్రమణదారులు నిర్మాణాలు తాత్కాలికంగా నిలిపివేశారు.

చిరుత కలకలం!



మామిడి తోపులో చిరుత పాదముద్రలు

ఐరాల, ఏప్రిల్ 26 (ఆంధ్రజ్యోతి): తహసీల్దార్ కార్యాలయానికి కూతవేటు దూరంలోని చెంగనపల్లెలో ఓ చిరుత కలకలం రేపుతోంది. చెంగనపల్లెలో ఉన్న మట్టపల్లెకు చెందిన మల్లీశ్వర రెడ్డి మామిడి తోపులో శనివారం చిరుత పాద ముద్రలు కనిపించాయి. ఈ విషయాన్ని అటవీశాఖ అధికారుల దృష్టికి తీసుకెళితే వారు పాదముద్రలు సరిగా కనిపించడం లేదని చెప్పినట్లు మల్లీశ్వరరెడ్డి తెలిపారు. గ్రామానికి సమీపంలోని పెద్ద కొండలో నాలుగు చిరుతలున్నట్టు గ్రామస్తులు చెబుతున్నారు. చిరుతలు, ఇతర అడవి జంతువులు తరచూ పెద్దకొండ నుంచి రోడ్డుకు అవతల ఉన్న దుర్గంకొండ దిగువ భాగంలో ఉన్న సీతానుమూల వద్ద చెలిమిలో నీళ్ల తాగడానికి వస్తుంటాయన్నారు. గతంలో చిరుత దాడిచేసి ఓ పాడి ఆవును చంపి తిన్నట్లు చెప్పారు. తరచూ గొర్రెలు మేపేవారికి చిరుతలు కనిపించినట్లు సమాచారం. అటవీశాఖ అధికారులు పెద్దకొండ, దుర్గంకొండ ప్రాంతాల్లో బోను ఏర్పాటు చేసి చిరుతను పట్టుకోవాలని గ్రామస్తులు కోరుతున్నారు.

ఆగమోక్తంగా శనీశ్వరస్వామికి తైలాభిషేకం



శ్రీకాళహస్తి, ఏప్రిల్ 26(ఆంధ్రజ్యోతి): శ్రీకాళహస్తీశ్వరాలయంలో కొలువై ఉన్న శనీశ్వరస్వామికి శనివారం ఆగమోక్తంగా పూజలు నిర్వహించారు. స్వామి అమ్మవార్ల అభిషేకం అనంతరం శనీశ్వరస్వామి సన్నిధిలో కలశ ప్రతిష్ఠ చేసి మొదట గణపతి, కలశ పూజలను చేశారు. అనంతరం స్వామివారికి నువ్వుల నూనె, పాలు, పెరుగు, చందనం, నారికేళ, కలశ జలాలతో అభిషేకించారు. అనంతరం స్వామివారిని పలు పుష్పాలతో విశేషంగా అలంకరించి ధూప, దీప నైవేద్యాలు సమర్పించారు. శని త్రయోదశి కావడంతో భక్తులు పెద్దసంఖ్యలో పాల్గొని స్వామివారిని దర్శించుకున్నారు.

కాలువ భూమినీ కలిపేసుకున్నారు



కాలువ భూమిని కలిపేసుకుని నిర్మించిన రోడ్డు

తిరుపతిరూరల్, ఏప్రిల్26 (ఆంధ్రజ్యోతి): పైడిపల్లెలో సర్వేనంబరు 195/1లోని కాలువభూమి ఆక్రమణకు గురైంది. సర్వేనంబరు194/2లోని పట్టాభూమిలో తొండవాడకు చెందిన వైసీపీనేత ఒకరు లేఅవుట్ వేశారు. ఇందులోని వేళ్లేందుకు ఏర్పాటు చేసిన దారి కోసం పట్టాభూమితో పాటు పక్కనే ఉన్న కొంత కాలువభూమిని కలిపేసుకున్నారని గ్రామస్తులు ఆరోపిస్తున్నారు. స్థానిక రెవెన్యూ అధికారులకు తెలిసినా తెలియనట్లు వ్యవహరిస్తున్నారని వారు విమర్శిస్తున్నారు. దీనిపై విలేజ్ సర్వేయర్‌ని వివరణ కోరగా రోడ్డు స్థలంలో కొంత కాలువభూమి కలిపి ఉందన్నారు.

అవిలాలలో ఆక్రమణల తొలగింపు

అవిలాల రెవెన్యూ లెక్కదాఖలా సర్వేనంబరు18లోని ప్రభుత్వ స్థలంలో ఏర్పాటు చేసిన తాత్కాలిక నిర్మాణాల(షెడ్లు)ను శనివారం రెవెన్యూ అధికారులు తొలగించారు. వేదాంతపురంఅగ్రహారం సర్కిల్‌కి సమీపంలోని రోడ్డుపక్కన షెడ్లని నిర్మించారు. గ్రామస్తులు తహసీల్దార్ రామాంజులనాయక్‌కి ఫిర్యాదు చేయడంతో రెవెన్యూ అధికారులు స్పందించారు.

టెన్త్‌లో ఉత్తమ మార్కులు పొందిన ప్రత్యేక ప్రతిభావంతులు

● అభినందించి ట్యాబ్‌లు బహూకరించిన డీఈఓ కేవీఎన్ కుమార్



ప్రత్యేక ప్రతిభావంతులను సన్మానించి అభినందిస్తున్న డీఈఓ కేవీఎన్ కుమార్.

తిరుపతి(విద్య), ఏప్రిల్ 26(ఆంధ్రజ్యోతి): అంగవైకల్యం కలిగి పలువురు ప్రభుత్వ పాఠశాలలు, భవిత కేంద్రాలకు చెందిన విద్యార్థులు పదవ తరగతి పరీక్షల్లో ఉత్తమ ప్రతిభకనబరిచి మంచి మార్కులు సాధించారు. సెరిబ్రల్ పాలసీ వైకల్యం కలిగిన నారాయణవరం మండలం, పాలమంగళం జడ్పీహెచ్‌ఎస్ విద్యార్థి మేరువా ఆశిష్ పదవ తరగతిలో 481 మార్కులు సాధించి ప్రత్యేకావసరాలు కలిగిన విద్యార్థుల్లో ప్రథమ స్థానంలో నిలిచారు. అలాగే పిచ్చాటూరు జడ్పీహెచ్‌ఎస్ విద్యార్థిని పి. సాత్విక 449 మార్కులతో ద్వితీయ స్థానంలో నిలిచారు. మేధో వైకల్యం కలిగిన తిరుపతికి ఎస్పీజేఎన్ఎం పాఠశాల విద్యార్థి షేక్. హర్షద్ 430 మార్కులు సాధించి తృతీయ స్థానంలో నిలిచారు. వీరిని డీఈఓ కేవీఎన్ కుమార్ శనివారం కలెక్టరేట్‌లోని తన కార్యాలయంలో దుశ్శాలులతో సన్మానించారు. ట్యాబ్‌లు బహూకరించి అభినందించారు. జిల్లా సహిత విద్యా సమన్వయకర్త చంద్రశేఖర్ రెడ్డి, ఏపీవో గోపాల్ కృష్ణ, ఏఎస్ఓ రుక్మాంగద, పిల్లల తల్లిదండ్రులు, సహిత విద్య ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

మెరిట్ స్కాలర్‌షిప్‌ల అందజేత



తిరుపతి (విశ్వవిద్యాలయాలు), ఏప్రిల్ 26 (ఆంధ్రజ్యోతి): ఎస్వీయూలో ప్రొఫెసర్ గోవిందరాజులు - డాక్టర్ ఉషారాణి పేరుపై ఏర్పాటు చేసిన మెరిట్ స్కాలర్‌షిప్‌లను శనివారం అందజేశారు. వీసీ అప్పారావు, రిజిస్ట్రార్ భూపతి నాయుడు, ప్రొఫెసర్ గోవిందరాజులు, డాక్టర్ ఉషారాణి తదితరులు అర్హులైన నలుగురు విద్యార్థులకు రూ.1,10,765 నగదు రూపంలో అందించారు. స్కాలర్‌షిప్ పొందిన వారిలో.. హేమలత, ప్రమిద, సుమిత్ర (మ్యాథ్స్), గోపిక (కంప్యూటర్ సైన్స్), ఉన్నారు. సీడీసీ డీన్ చెంద్రాయుడు, ప్రిన్సిపాల్స్ నరసయ్య, పద్మావతి పాల్గొన్నారు.

రఘురామ కృష్ణమరాజు క్షమాపణ చెప్పాలి : వామపక్షాలు



మాట్లాడుతున్న నాగరాజు,వామపక్ష నాయకులు

తిరుపతి(జీవకోన), ఏప్రిల్ 26(ఆంధ్రజ్యోతి): సీపీఎం రాష్ట్ర కార్యదర్శి వి.శ్రీనివాసరావుపై అనుచిత వ్యాఖ్యలుచేసిన ఉండి ఎమ్మెల్యే, డిప్యూటీ స్పీకర్ రఘురామకృష్ణంరాజు బహిరంగ క్షమాపణ చెప్పాలని వామపక్ష నేతలు డిమాండ్ చేశారు. శనివారం తిరుపతి ప్రెస్‌క్లబ్‌లో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో వారు మాట్లాడారు. ఉండి నియోజకవర్గంలో పేద ప్రజల ఇళ్లు కూల్చివేసిన ఘటనపై ప్రశ్నించేందుకు వెళ్లిన సీపీఎం రాష్ట్ర కార్యదర్శిపై నోరు పారేసుకోవడం తగదన్నారు. ఈ సమావేశంలో సీపీఎం జిల్లా కార్యదర్శి వందవాసి నాగరాజు, కార్యవర్గ సభ్యులు కందారపు మురళి, సీపీఐ జిల్లా కార్యదర్శి మురళి, కార్యవర్గ సభ్యులు రాధాకృష్ణ, రిపబ్లికన్ పార్టీ ఆఫ్ ఇండియా దక్షిణాది రాష్ట్రాల అధ్యక్షులు అంజయ్య, ఆమ్ ఆద్మీ పార్టీ అధ్యక్షులు నగేష్ పాల్గొన్నారు.

సీడబ్ల్యుఎస్ఎన్ క్రీడా పోటీల్లో జిల్లా విద్యార్థుల ప్రతిభ



విజేతలను అభినందిస్తున్న డీఈఓ కేవీఎన్ కుమార్.

తిరుపతి(విద్య), ఏప్రిల్ 26(ఆంధ్రజ్యోతి): ఏలూరులో ఈనెల 22 నుంచి 24వ తేదీ వరకు జరిగిన ప్రత్యేక అవసరాలు కలిగిన (సీడబ్ల్యుఎస్ఎన్) విద్యార్థుల క్రీడా పోటీల్లో జిల్లాకు చెందిన విద్యార్థులు విశేష ప్రతిభ కనబరిచారు. వీరిని డీఈఓ కేవీఎన్ కుమార్ అభినందించారు. పల్లమాల పాఠశాలకు చెందిన 8వ తరగతి విద్యార్థి ఎం.ప్రతాప్ బోసీబాల్ క్రీడలో రాష్ట్రస్థాయిలో రెండవ బహుమతిని గెలుచుకున్నారు. శ్రీకాంత్ 100 మీటర్లు, 200 మీటర్ల పరుగుపందెంలో 2వ స్థానంలో గెలుపొంది ఏపీ పాఠశాల విద్య డైరెక్టర్ విజయరామరాజు చేతుల మీదుగా బహుమతులు అందుకున్నారు. ఈ విద్యార్థులు తమ ఉపాధ్యాయులతో శనివారం డీఈఓను కలిశారు. ఈ సందర్భంగా ఆయన వారిని అభినందించారు.

ఫైళ్ల దగ్ధం కేసులో తదుపరి వంతు తుకారాందే?

● విదేశాల నుంచి రప్పించడానికి ప్రయత్నాలు

● మాధవరెడ్డి బెయిల్ పిటిషన్ రద్దుపై పిటిషన్ దాఖలుకు సిద్ధం

తిరుపతి(నేరవిభాగం), ఏప్రిల్ 19(ఆంధ్రజ్యోతి): మదనపల్లె ఫైళ్ల దగ్ధం కేసులో సీఐడీ దూకుడు పెంచింది. ఈ ఘటన వెనుక ఉన్న మరో ముఖ్యమైన వ్యక్తి, మాజీ మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి వ్యక్తిగత కార్యదర్శి తుకారాంను పట్టుకునేందుకు చర్యలు ప్రారంభించింది. విదేశాల నుంచి తీసుకురావడానికి ప్రయత్నాలు ముమ్మరం చేసింది. ఇప్పటికే ఈ కేసులో ఆర్డీవో కార్యాలయ ఉద్యోగి తేజను అరెస్టు చేయడం, పెద్దిరెడ్డి ప్రధాన అనుచరుడు మాధవ రెడ్డిని అదుపులోకి తీసుకోవడం తెలిసిందే. మాధవరెడ్డికి చిత్తూరు కోర్టు బెయిల్ మంజూరు చేసిన నేపథ్యంలో ఆ బెయిల్ రద్దు చేయాలని హైకోర్టులో పిటిషన్ దాఖలు చేయడానికి సీఐడీ అధికారులు సోమవారం విజయవాడకు వెళుతున్నారు.

మాధవరెడ్డి అరెస్టుతో ఫైళ్ల కేసులో సూత్రధారులు, పాత్రధారులు అయిన వైసీపీ నేతల వెన్నులో వణుకు పుడుతోంది.ఫైళ్ల దగ్ధం వెనుక ఎవరెవరున్నారు? ఎక్కడ తల దాచుకున్నారు? లాంటి వివరాలను మొబైల్ ఫోన్ల కాల్ డేటా ద్వారా సేకరించేందుకు దర్యాప్తు అధికారులు కదులుతున్నారు. ఈ క్రమంలోనే త్వరలో తుకారాంతో పాటు మరో ఇద్దరిని అదుపులోకి తీసుకోవడానికి సీఐడీ బృందం విచారణలో వేగం పెంచింది.

1నుంచి అగస్త్యేశ్వరస్వామి వార్షిక బ్రహ్మోత్సవాలు

నారాయణవనం, ఏప్రిల్ 26(ఆంధ్రజ్యోతి): మండలంలోని కల్యాణ వేంకటేశ్వరస్వామి ఆలయానికి అనుబంధంగా ఉన్న మరగదవల్లీ సమేత అగస్త్యేశ్వరస్వామి వారి ఆలయ వార్షిక బ్రహ్మోత్సవాలు మే 1 నుంచి 10వ తేది వరకు నిర్వహించనున్నట్లు టీటీడీ అధికారులు పేర్కొన్నారు. ఏప్రిల్ 30న సాయంత్రం 6 గంటల నుంచి రాత్రి 8.30 మధ్య గణపతి ఉత్సవం, అంకురార్పణం, మే 1న ఉదయం 7.30 - 9.00 గంటల మధ్య వృషభ లగ్నంలో ధ్వజారోహణం నిర్వహిస్తారు. అదే రోజు రాత్రి 7.30 గంటలకు చంద్రప్రభ వాహనంపై అగస్త్యేశ్వరస్వామి భక్తులకు దర్శనమిస్తారు. ప్రతి రోజు ఉదయం 10నుంచి 11 గంటల మధ్య స్వామివారి ఉత్సవ మూర్తులకు స్నపన తిరుమంజనం నిర్వహిస్తారు. ప్రతిరోజు రాత్రి 7.30 గంటలకు స్వామి వారి వాహన సేవలుంటాయి. మే 2న సింహ వాహనం, 3న హంసవాహనం, 4న శేషవాహనం, 5న నంది వాహనం, 6న గజవాహన సేవలుంటాయి. మే 7న రథోత్సవం, 8న కల్యాణోత్సవం, రాత్రి అశ్వవాహనం, మే 9న నటరాజస్వామికి అభిషేకం, వీధి ఉత్సవం జరుగుతాయి.

సీపీఆర్‌తో ప్రాణాలకు రక్షణ

● స్విమ్స్ కార్డియాలజిస్ట్ వనజాక్షమ్మ



సీపీఆర్‌పై అవగాహన కల్పిస్తున్న దృశ్యం

తిరుపతి (విశ్వవిద్యాలయాలు), ఏప్రిల్ 26 (ఆంధ్రజ్యోతి): పద్మావతి మహిళా యూనివర్సిటీలో రెండు రోజులుగా సీపీఆర్‌పై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. స్విమ్స్ కార్డియాలజీ డాక్టర్ వనజాక్షమ్మ, వర్సిటీ నర్సింగ్ కాలేజీ ప్రిన్సిపాల్ గంగాభవాని, శాస్త్రవేత్త ప్రసాద్ మాట్లాడుతూ ప్రాణాపాయ పరిస్థితుల్లో సీపీఆర్ ద్వారా కాపాడవచ్చన్నారు. ఇందువల్ల అందరూ సీపీఆర్ గురించి తెలుసుకోవాలన్నారు. నర్సింగ్ విద్యార్థినులకు, ప్రతినిధులకు సీపీఆర్‌పై ప్రయోగాత్మకంగా తెలియ చేశారు. అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

మనోవేదనతో నవ వధువు ఆత్మహత్య

శాంతిపురం, ఏప్రిల్ 26 (ఆంధ్రజ్యోతి) : ఊరు కాని ఊరు...వచ్చీ రాని భాష...ఆపై ఒంటరితనం..ఆరోగ్య సమస్యలు...దీంతో ఏమి చేయాలో అర్థం కాక మనోవేదనతో ఓ నవవధువు ఆత్మహత్యకు పాల్పడింది. ఎస్ఐ నరేష్ కథనం ప్రకారం.... శాంతిపురం మండలం గుంజార్లపల్లె పంచాయతీ తుమ్మిశికొత్తూరుకు చెందిన సుబ్రమణ్యానికి రెండు నెలల క్రితం ఒడిశా రాష్ట్రం గంజాం జిల్లా బరంపురం ప్రాంతానికి చెందిన సాబిత్రితో వివాహం జరిగింది.శాంతిపురం శివాలయం వీధిలోని ఓ అద్దె ఇంట్లో కాపురముంటున్నారు.సుబ్రమణ్యం కూలి పనుల కోసం బయటకు వెళ్లి తిరిగి సాయంత్రం ఇంటికి చేరుకునేవాడు. సరిగా రాని భాషతో ఇబ్బందులు పడుతూ సాబిత్రి రోజంతా ఒంటరిగా గడిపేది. దీనికి తోడు ఆరోగ్య సమస్యలున్నాయి. వీటన్నింటిని వందలాది కిలోమీటర్ల దూరంలో ఉన్న తల్లిదండ్రులకు ఫోన్ ద్వారా చెప్పినా సర్దుకుపోవాలన్నారు తప్ప.. బిడ్డ బాధను అర్థం చేసుకోలేదు.ఈ నేపథ్యంలో శుక్రవారం రాత్రి ఆలస్యంగా ఇంటికి చేరుకున్న సుబ్రమణ్యం భార్య ఎంతసేపటికీ తలుపులు తీయకపోవడంతో తుమ్మిశికొత్తూరు వెళ్లిపోయాడు. శనివారం ఉదయం ఇంటికి వచ్చాడు. అప్పటికీ తలుపులు తీయకపోవడంతో పగలగొట్టి చూడగా ఇంట్లో ఫ్యాన్‌కు ఉరివేసుకున్న సాబిత్రి కన్పించింది. సాబిత్రి మృతదేహాన్ని కుప్పం ఆస్పత్రికి తరలించిన పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

4నుంచి పోలేరమ్మ జాతర

నాయుడుపేట టౌన్, ఏప్రిల్ 26(ఆంధ్రజ్యోతి) నాయుడుపేట పట్టణంలోని గడియారం సెంటర్ వద్ద వెలసిన గ్రామదేవత పోలేరమ్మ జాతరను వచ్చే నెల 4వ తేదీనుంచి నిర్వహించనున్నట్లు సూళ్లూరుపేట ఎమ్మెల్యే డాక్టర్ నెలవల విజయశ్రీ తెలిపారు. ఇందుకు సంబంధించిన పోస్టర్లను ఎమ్మెల్యే విజయశ్రీ, నియోజకవర్గ ఇన్‌చార్జి నెలవల సుబ్రహ్మణ్యం పట్టణంలోని టీడీపీ కార్యాలయంలో శనివారం రాత్రి ఆవిష్కరించారు. 4,5 తేదీల్లో ఘటోత్సవం, 6వ తేదీ రాత్రి అమ్మరాత్రి నిలుపు, 7న అమ్మవారి జాతర, అదేరోజు రాత్రి అమ్మవారి సాగనంపు ఉత్సవం నిర్వహించనున్నట్లు దేవదాయశాఖ ఈవో రవికృష్ణ తెలిపారు. కార్యక్రమంలో జాతర కమిటీ అధ్యక్షుడు నానాపాల సుబ్బారావు, మణి, అరవభూమి శ్రీనివాసులురెడ్డి తదితరులు పాల్గొన్నారు.

డ్రోన్ల కొనుగోలుకు రైతు సంఘాలకు సబ్సిడీతో రుణాలు

● డీసీసీబీ బోర్డు మీటింగ్‌లో ఏకగ్రీవ తీర్మానం

చిత్తూరు కలెక్టరేట్, ఏప్రిల్ 26 (ఆంధ్రజ్యోతి): డ్రోన్ల కొనుగోలుకు రైతు సంఘాలకు సబ్సిడీతో కూడిన రుణాలు మంజూరు చేయాలని జిల్లా సహకార కేంద్ర బ్యాంకు (డీసీసీబీ) ఏకగ్రీవ తీర్మానం చేసింది. శనివారం బ్యాంకు ప్రధాన కార్యాలయంలో జేసీ, బ్యాంకు అఫిషియల్ పర్సన్ ఇన్‌చార్జి విద్యాధరి అధ్యక్షతన డీసీసీబీ బోర్డు మీటింగ్ జరిగింది. రైతు సంఘాలకు ఒక్కో డ్రోన్ కొనుగోలుకు 80శాతం సబ్సిడీతో కూడిన యూనిట్ ధర రూ.9.10 లక్షల రుణం రూపంలో నిధులు విడుదల చేయాలని బ్యాంకు అధికారులను జేసీ సూచించారు. పీఎం సూర్యఘర్ కింద గ్రామీణ ప్రాంతాల్లో రైతుల ఇళ్లకు సోలార్ ప్యానళ్లు అమర్చడాకి రూ.3లక్షల వరకు రుణాలు ఇచ్చేందుకు బోర్డు తీర్మానించిందన్నారు.

ఈ ఏడాది బంగారం కుదువపై బ్యాంకు శాఖలు ఇంతవరకు రూ.210 కోట్లు ఇవ్వగా, ఇకపై సింగిల్‌విండోల ద్వారా కూడా సొసైటీకి రూ.కోటి మేర రుణాలివ్వాలని నిర్ణయించారన్నారు. బ్యాంకు బ్రాంచ్‌లు గుర్తించిన సింగిల్ విండోల ద్వారా కూడా అర్హతను బట్టి ఖాతాపై రూ.3లక్షల వరకు స్వల్పకాలికేతర రుణాలు ఇవ్వాలని బోర్డు సిఫార్సు చేసిందన్నారు. సీఈవో శంకర్‌బాబు , ఆప్కాబ్ డీజీఎం షఫీ, నాబార్డు డీడీఎం సునీల్, బ్యాంకు జీఎంలు మనోహర్ గౌడ్, లిల్లీ కేథరిన్, డీజీఎం చలపతి, ఏజీఎం సురేష్ బాబు, సిబ్బంది పాల్గొన్నారు.



భవానీనగర్ కూడలిలో ఏర్పాటు చేసిన రూఫ్ టాప్ గ్రీన్ మ్యాట్స్

పచ్చని పందిరి తెచ్చింది చల్లదనం

తిరుపతి(కల్చరల్), ఏప్రిల్ 26(ఆంధ్రజ్యోతి): నగరంలోని ప్రధాన కూడళ్లలో వాహన దారులకు ఎండ తగలకుండా తిరుపతి ఆర్యవైశ్య సంఘం సభ్యులు రూఫ్ టాప్ గ్రీన్ మ్యాట్స్ ఏర్పాటు చేయడం అభినందనీయని తిరుపతి ఎమ్మెల్యే ఆరణి శ్రీనివాసులు అన్నారు. భవానీనగర్ కూడలిలో ఏర్పాటు చేసిన రూఫ్ టాప్ గ్రీన్ మ్యాట్‌ను శనివారం ఎమ్మెల్యే ప్రారంభించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ మరిన్ని కూడళ్లలోనూ గ్రీన్ మ్యాట్స్ ఏర్పాటు చేస్తామని ముందుకు రావడం అభినందనీయమన్నారు. ఈ కార్యక్రమంలో ఆర్యవైశ్య సంఘం అధ్యక్షులు దిండుకుర్తి నరసింహులు, మహేష్, సురేష్ పాల్గొన్నారు.

అలిపిరిలో టెంకాయలు కొట్టిన నాయీ బ్రాహ్మణులు



తిరుపతి(టీటీడీ), ఏప్రిల్ 26(ఆంధ్రజ్యోతి): దేవదాయ శాఖలో పనిచేస్తున్న నాయీ బ్రాహ్మణుల జీతాన్ని పెంచడం పట్ల తిరుమల కళ్యాణ కట్ట నాయీ బ్రాహ్మణుల సంఘం సభ్యులు సంతోషం వ్యక్తం చేశారు. అలిపిరి పాదాల మండపంలో శనివారం టెంకాయలు కొట్టి మొక్కులు తీర్చుకున్నారు. అనంతరం ముఖ్యమంత్రి చంద్రబాబు, ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ చిత్రపటాలకు పాలాభిషేకం చేశారు. ఈ కార్యక్రమంలో సంఘం గౌరవాధ్యక్షులు వెంకటరత్నం, అధ్యక్షులు హరి, ప్రధాన కార్యదర్శి ప్రసాద్, రెడ్డిశేఖర్, గిరిధర్ తదితరులు పాల్గొన్నారు.

పెహల్గామ్ మృతులకు నివాళి

తిరుపతి(కల్చరల్), ఏప్రిల్ 26(ఆంధ్రజ్యోతి): కశ్మీర్ పెహల్గామ్‌లో జరిగిన ఉగ్రదాడిలో మృతిచెందిన వారికి భజన మండలి కళాకారులు నివాళులు అర్పించారు. ప్రతి శనివారం నిర్వహించే నగర సంకీర్తనను గోవింద నామ స్మరణతో నిర్వహించారు. అనంతరం మృతులకు నివాళులు అర్పించారు. ఈ కార్యక్రమంలో గుండాల గోపినాథ్‌రెడ్డి, వాసుదేవరెడ్డి, మునినాథరెడ్డి, చెంగారెడ్డి, సుబ్రహ్మణ్యంరెడ్డి, రాజశేఖర్ తదితరులు పాల్గొన్నారు.

మహిళల పక్షపాతి కూటమి ప్రభుత్వం

తిరుపతి అర్బన్, ఏప్రిల్ 26(ఆంధ్రజ్యోతి): మహిళల సాధికారత కోసం ఎన్డీఏ కూటమి ప్రభుత్వం కృషి చేస్తోందని ఎమ్మెల్యే ఆరణి శ్రీనివాసులు అన్నారు. మహిళలకు ఇచ్చిన ప్రతి హామీని ప్రభుత్వం నెరవేరుస్తోందన్నారు. స్థానిక సీఎస్‌సీ శనివారం ఆయన ఉచిత కుట్టు శిక్షణ కార్యక్రమాన్ని ప్రారంభించారు. బీసీ కార్పొరేషన్, ఈడబ్ల్యూఎస్ ఆధ్వర్యంలో 90 రోజుల శిక్షణకు 360 మంది మహిళలు ఎంపికయ్యారు. ఈ కార్యక్రమంలో బీసీ సంక్షేమ శాఖ ఈడీ శ్రీదేవి, యాదవ కార్పొరేషన్ చైర్మన్ నరసింహయాదవ్, మాజీ ఎమ్మెల్యే సుగుణమ్మ, రాజారెడ్డి, నాయీబ్రాహ్మణ చైర్మన్ రుద్రకోటి సదాశివం, డిప్యూటీ మేయర్లు ముద్ర నారాయణ, ఆర్సీ మునికృష్ణ, పులుగోరు మురళి, శ్రీధర్‌వర్మ, ఎస్కే బాబు పాల్గొన్నారు.

అభినయ్.. నీ డ్రామాలు కట్టిపెట్టు

• ఆర్సీ మునికృష్ణ

తిరుపతి(జీవకోన), ఏప్రిల్ 26(ఆంధ్రజ్యోతి): 'అభినయ్.. ఇంటింటికీ వెళ్లి ప్రభుత్వంపై విమర్శలు చేసే నీ డ్రామాలు కట్టిపెట్టు' అని డిప్యూటీ మేయర్ ఆర్సీ మునికృష్ణ సూచించారు. శనివారం తిరుపతి ప్రెస్‌క్లబ్‌లో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడారు. ప్రభుత్వం సూపర్ సిక్స్ అమలు చేయలేదని చేస్తున్న ప్రచారాన్ని నమ్మే పరిస్థితిలో ప్రజలు లేరన్నారు. తిరుపతిలో నిర్వహిస్తున్న ప్రజాదర్బార్‌కు మీ వల్ల కలిగిన భూ సమస్యలే అధికంగా వస్తున్నాయని చెప్పారు. కొందరి కార్పొరేటర్ల ఆస్తులు వృద్ధి చెందేలా చేశారే తప్ప ప్రజలకు చేసిందేమీ లేదన్నారు. అందుకే ఇంట్లో కూర్చోబెట్టారని పేర్కొన్నారు. ఇకనైనా డ్రామాలు మానుకోవాలని హితవుపలికారు. చంద్రబాబు దిగిపోవాలని జగన్‌ని కుర్చోబెట్టాలంటూ రోజా చేస్తున్న వ్యాఖ్యలు హాస్యాస్పదం గా ఉన్నాయని పేర్కొన్నారు. నాయీ బ్రాహ్మణ కార్పొరేషన్ చైర్మన్ రుద్రకోటి సదాశివం మాట్లాడుతూ సూపర్‌సిక్స్ పథకాలను ఒక్కొక్కటిగా అమలు చేసే దిశగా ప్రభుత్వం అడుగులు వేస్తోందన్నారు. ఈ సమావేశంలో టీడీపీ నాయకులు మహేష్‌యాదవ్, శ్రీధర్, రవిశంకర్‌యాదవ్ (సుబ్బుయాదవ్), దేవరాజులు, సుధాకర్‌రెడ్డి పాల్గొన్నారు.

ప్రభుత్వ పాఠ్యపుస్తకాల రవాణా ప్రారంభం



ప్రభుత్వ పాఠ్యపుస్తకాల రవాణా ప్రారంభిస్తున్న డీఈవో శేఖర్, ఆర్టీసీ ఏటీఎం రామచంద్రనాయుడు

తిరుపతి(ఆర్టీసీ), ఏప్రిల్ 26(ఆంధ్రజ్యోతి): ఏపీఎస్ ఆర్టీసీ డీజీటీ ద్వారా ప్రభుత్వ పాఠ్యపుస్తకాల రవాణా ప్రక్రియ శనివారం ప్రారంభమైంది. తిరుచానూరు కేంద్రం వద్ద సాయంత్రం డీఈవో శేఖర్, సీటీఎస్ ఏటీఎం రామచంద్రనాయుడు శాస్త్రోక్తంగా పూజలు నిర్వహించారు. అనంతరం కూలీలకు పుస్తకాలను అందించారు. శ్రీకాళహస్తి డివిజన్‌కు సరిపడ పుస్తకాలను డీజీటీ ద్వారా తరలించారు. మొత్తం 14,20,722 పుస్తకాలను మే 15 తేదీ గడువులోగా ఉమ్మడి చిత్తూరు జిల్లాలో మొత్తం 66 మండలాల్లోని ఎమ్మార్సీ సెంటర్లకు చేరవేయనున్నారు.

అపోలోలో గుండెకు అధునాతన వైద్యం



మాట్లాడుతున్న డాక్టర్ విజయచంద్రారెడ్డి

తిరుపతి (వైద్యం), ఏప్రిల్ 26(ఆంధ్రజ్యోతి): అపోలో ఆస్పత్రిలో అడ్వాన్స్ టెక్నాలజీతో అధునాతన గుండె వైద్య సేవలు అందిస్తున్నామని చెన్నై అపోలో ఆస్పత్రికి చెందిన ప్రముఖ కార్డియాలజిస్టు విజయచంద్రారెడ్డి పేర్కొన్నారు. స్థానిక ఓ ప్రవేటు ఆస్పత్రిలో శనివారం అపోలో ఆస్పత్రికి చెందిన ప్రముఖ వైద్య నిపుణులతో కలిసి ఆయన మీడియాతో మాట్లాడారు. ప్రస్తుత జీవనశైలితో గుండె జబ్బులు ఎక్కువగా ఉన్నాయ న్నారు. గుండె జబ్బులను నిర్లక్ష్యం చేసినా సకాలంలో తగిన వైద్యం అందకపోయినా ప్రాణాలు కోల్పోవాల్సి ఉంటుందన్నారు. దీనిపై అపోలో వైద్యులు పూర్తి స్థాయిలో సర్వే నిర్వహించి తక్కువ ఖర్చుతో నాణ్యమైన వైద్యం అందిస్తున్నారని వివరించారు. అనంతరం గుండె జబ్బుల బారిన పడకుండా పాటించాల్సిన జాగ్రత్తలు, ఆహారపు అలవాట్ల గురించి ఆయన ప్రత్యేకంగా వివరించారు. ఈ కార్యక్రమంలో జీఎం డాక్టర్ నాగార్జునరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

వైభవంగా గంగ జాతర నిర్వహిస్తాం



కరపత్రాలను ఆవిష్కరిస్తున్న ఎమ్మెల్యే ఆరణి శ్రీనివాసులు, మాజీ ఎమ్మెల్యే సుగుణమ్మ, నరసింహయాదవ్, ఆర్సీ.మునికృష్ణ తదితరులు

తిరుపతి(కల్చరల్), ఏప్రిల్ 26(ఆంధ్రజ్యోతి): తిరుపతి తాతయ్యగుంట గంగమ్మ జాతరను మే 6 నుంచి 13 వరకు, అలాగే 14న విశ్వరూప దర్శనం దాకా వైభవంగా నిర్వహించేందుకు అన్ని ఏర్పాట్లు పూర్తి చేస్తున్నట్లు ఎమ్మెల్యే ఆరణి శ్రీనివాసులు అన్నారు. ఆలయంలో శని వారం జాతర వాల్‌పోస్టర్లను, కరపత్రాలను కూటమి నాయకులతో కలిసి ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జాతర నిర్వహణకు ఉత్సవ కమిటీని కూటమి నాయకులతో కలిసి ఏర్పాటు చేసి భక్తులకు ఎలాంటి అసౌకర్యాలు లేకుండా చేస్తామన్నారు. ఇప్పటికే కలెక్టర్ అధ్యక్షతన అన్ని విభాగాల అధికారులతో జాతర ఏర్పాట్లపై ఆదేశాలు జారీ చేశామన్నారు. గతంలో పెండింగ్‌లో ఉన్న పనులతో పాటు రూ.4కోట్ల టీటీడీ నిధులతో జరుగుతున్న పనులుజాతరలోపు పూర్తిచేస్తామని చెప్పారు. ప్రహరీ పనులను రెండు,మూడు నెలల్లో పూర్తి చేస్తామన్నారు. ఈ కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్యే సుగుణమ్మ, డిప్యూటీ మేయర్ ఆర్సీ మునికృష్ణ, యాదవ కార్పొరేషన్ చైర్మన్ నరసింహ యాదవ్, ఆలయ ఈవో జయకుమార్, టీడీపీ నాయకులు మబ్బు దేవనారాయణరెడ్డి, శ్రీధర్‌వర్మ, మహేష్ యాదవ్, బీజేపీ నాయకులు అజయ్‌కుమార్, జనసేన నాయకులు రాజారెడ్డి, సుభాషిణి పాల్గొన్నారు.

గ్రేవ్ కేసుల దర్యాప్తు వేగవంతం చేయాలి

నేర సమీక్షలో ఎస్పీ ఆదేశం



జిల్లా స్థాయి నేర సమీక్ష సమావేశంలో మాట్లాడుతున్న ఎస్పీ

తిరుపతి(నేరవిభాగం) ఏప్రిల్ 19(ఆంధ్రజ్యోతి): జిల్లాలో గ్రేవ్ (మర్డర్, దోపిడీలు, రోడ్డుప్రమాదంలో ఎక్కువమంది చనిపోవడం, అత్యాచారాలు, పోక్సో కేసులు) కేసుల దర్యాప్తు వేగవంతం చేయాలని, హౌస్ బ్రేకింగ్ కేసులపై ప్రత్యేక దృష్టిసారించాలని ఎస్పీ హర్షవర్ధన రాజు ఆదేశించారు. శనివారం తిరుపతిలోని పోలీసు అతిథి గృహంలో జిల్లాస్థాయి నేర సమీక్షా సమావేశం జరిగింది. ఇందులో ప్రధానంగా గ్రేవ్ కేసులు, నాన్ బెయిలబుల్ వారెంట్లు ఎగ్జిక్యూట్ చేయడం, హౌస్ బ్రేకింగ్ కేసులు, మహిళలపై జరుగుతున్న అఘాయిత్యాలపై సమీక్షించారు. సబ్ డివిజన్ల వారీగా వున్న కేసుల వివరాలు తెలుసుకుని సరిగా పని చేయని అధికారులపై అసంతృప్తి వ్యక్తం చేశారు. గ్రేవ్ కేసుల పరిష్కారానికి అవసరమైతే ప్రత్యేక టీమ్‌లు ఏర్పాటు చేసుకుని వేగవంతంగా పరిష్కరించాల న్నారు. మిస్సింగ్ కేసులకు సంబంధించి ప్రతి ఫైలునూ పరిశీలించారు. 2021 నుంచి జరిగిన హౌస్ బ్రేకింగ్ కేసులపై ఆరా తీశారు. గూడూరు, నాయుడుపేట, పుత్తూరు సబ్ డివిజన్ల పరిధిలో కేసుల పురోగతిపై వారిని అభినందించారు. ఎక్కడైనా రోడ్డు ప్రమాదాలు జరిగినప్పుడు ప్రాణాలు కాపాడేలా ట్రాఫిక్ పోలీసులు పనిచేయాలని సూచించారు. పెండింగ్‌లో ఉన్న నాన్ బెయిలబుల్ వారెంట్లు వెంటనే ఎగ్జిక్యూట్ చేయాలని ఆదేశించారు. ఈ సమావేశంలో ఏఎస్పీలు రామకృష్ణ, రవిమనోహరాచారి, నాగభూషణరావు, వెంకట్రావు, డీఎస్పీలు, సీఐలు, సిబ్బంది పాల్గొన్నారు.

దేశ భద్రత కోసం మోదీ చర్యలకు సంపూర్ణ మద్దతు



మాట్లాడుతున్న ఊట్ల సురేంద్రనాయుడు

తిరుపతి(జీవకోన), ఏప్రిల్ 26 (ఆంధ్రజ్యోతి): దేశ భద్రత కోసం ప్రధానమంత్రి మోదీ తీసుకునే ఏ చర్యకు అయినా టీడీపీ సంపూర్ణ మద్దతు అందిస్తుందని తిరుపతి పార్లమెంట్ అధికార ప్రతినిధి ఊట్ల సురేంద్రనాయుడు అన్నారు. శనివారం 1వ డివిజన్ పరిధిలోని పార్టీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడారు. పహల్గాం దాడిని యావత్ భారతదేశం ఖండిస్తోందన్నారు. ఈ సమావేశంలో టీడీపీ నేతలు ధనంజయ్, వెంకటేష్ పాల్గొన్నారు.

దుస్తులు సరఫరా చేస్తానని నమ్మించి మోసం

కేసు నమోదు చేసిన పోలీసులు

తిరుపతి(నేరవిభాగం) ఏప్రిల్ 26(ఆంధ్రజ్యోతి): దుస్తులు సరఫరా చేస్తానని దుస్తుల దుకాణ యజమానిని నమ్మించి డబ్బు తీసుకుని మోసం చేసిన ఘటనపై పోలీసులు కేసు నమోదు చేశారు. ఈస్ట్ ఎస్ఐ సరస్వతి కథనం మేరకు.. స్థానిక టీకే స్ట్రీట్‌లో తిరుమలయ్య దుస్తుల దుకాణం నిర్వహిస్తున్నాడు. హోల్‌సేల్ వ్యాపారి సుమిత్‌కుమార్ ఫోన్‌లో అతడిని సంప్రదించాడు. హోల్‌సేల్ ధరలకు దుస్తులు సరఫరా చేస్తానని నమ్మించాడు. దీంతో తిరుమలయ్య అతనికి రూ.85వేలు పంపాడు. అయితే అతడు దుస్తులు సరఫరా చేయలేదు. నెలలు గడిచినా స్పందించకపోవడంతో ఈస్ట్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశాడు.

బస్సుల కోసం ప్రయాణికుల నిరీక్షణ



తిరుపతి(ఆర్టీసీ), ఏప్రిల్ 26(ఆంధ్రజ్యోతి): వారాంతం రోజుల్లో సెంట్రల్ బస్సుస్టేషన్‌లో ప్రయాణుకులు బస్సుల కోసం గంటల కొద్దీ నిరీక్షించాల్సి వస్తోంది. శనివారం బస్సులు లేక ప్రయాణికులు తీవ్ర ఇక్కట్లు పడ్డారు. ప్రతి శని, ఆదివారాలలో పరిస్థితి ఇలాగే ఉన్నా ఆర్టీసీ అధికారుల్లో చలనం లేదని ప్రయాణికులు అసహనం వ్యక్తం చేశారు. ముఖ్యంగా తిరుపతి నుంచి పీలేరు, మదనపల్లి, రాయచోటి, పుంగనూరు, కడప, రాజంపేట, కోడూరు, భాకరాపేట వంటి ఊర్లకు వెళ్లే ప్రయాణికులు గంటల తరబడి వేచి ఉండాల్సి వచ్చింది. సమాచారం అందించే కంట్రోలర్స్ కూడా అందుబాటులో లేకపోవడంతో ప్రయాణికులు అసంతృప్తి వ్యక్తం చేశారు. రద్దీకి అనుగుణంగా బస్సులు ఏర్పాటు చేయాలని ప్రయాణికుల కోరుతున్నారు.

ఉగ్ర దాడులను ఖండిస్తూ కొవ్వొత్తుల ర్యాలీ



కొవ్వొత్తులతో ర్యాలీ నిర్వహిస్తున్న వైద్య విద్యార్థులు

తిరుపతి(వైద్యం), ఏప్రిల్ 26(ఆంధ్రజ్యోతి): కశ్మీర్‌లో ఉగ్రవాదుల దాడులను ఖండిస్తూ ఆ దాడిలో మృతిచెందిన వారి ఆత్మకు శాంతి కలగాలని ఆశిస్తూ ఎస్వీ వైద్య కళాశాలలోని వైద్య విద్యార్థులు, పారా మెడికల్ విద్యార్థులు శనివారం కళాశాల ఆవరణలో నేషనల్ మెడికో ఆర్గనైజేషన్ ఆధ్వర్యంలో కొవ్వొత్తుల ర్యాలీ నిర్వహించారు. ఈ కార్యక్రమంలో కళాశాల ప్రొఫెసర్ డాక్టర్ రోజా రమణి, అధ్యాపకులు, సిబ్బంది పాల్గొన్నారు.

ఏపీపీఎస్సీ పరీక్షలు పకడ్బందీగా నిర్వహించాలి

తిరుపతి(కలెక్టరేట్), ఏప్రిల్ 26(ఆంధ్రజ్యోతి): ఏపీపీఎస్సీ పరీక్షలు పకడ్బందీగా నిర్వహించాలని డీఆర్వో నరసింహులు ఆదేశించారు. పరీక్షల నిర్వహణపై శనివారం కలెక్టరేట్‌లో డీఆర్వో సమీక్షించారు. ఇందులో ఆయన మాట్లాడుతూ ఆదివారం నుంచి 30వ తేదీ వరకు నిర్వహించనున్న ఏపీపీఎస్సీ పరీక్షలు ఉదయం 9.30 నంచి మధ్యాహ్నం 12 గంటల వరకు మధ్యాహ్నం 2 నుంచి సాయంత్రం 5గంటల వరకు రెండు దఫాలుగా జరుగుతాయన్నారు. జిల్లాలో రెండు పరీక్షా కేంద్రాలను ఏర్పాటు చేసినట్లు చెప్పారు. 1,929మంది అభ్యర్థులు హాజరుకానున్నారని ఈ పరీక్షల కోసం ఇద్దరు డిప్యూటీ తహసీల్దార్లు లైజన్ అధికారులుగా వ్యవహరిస్తారని పేర్కొన్నారు. ఈ సమావేశంలో అధికారులు నవజ్యోతి, ఆరోగ్యవాణి తదితరులు పాల్గొన్నారు.

హత్యాయత్నం కేసులో నిందితుడి అరెస్టు

తిరుపతి(నేరవిభాగం) ఏప్రిల్ 26(ఆంధ్రజ్యోతి): కొద్ది రోజుల క్రితం చింతల చేను వద్ద జరిగిన హత్యాయత్నం కేసులో నిందితుడిని శనివారం అరెస్టు చేశారు. ఈస్ట్ ఎస్ఐ మహేష్ కథనం మేరకు.. చింతల చేనులో కాపురమున్న సురేష్ రియల్ ఎస్టేట్ వ్యాపారం చేస్తున్నాడు. సురేష్ తెలంగాణా రాష్ట్రం మంచిర్యాలకు చెందిన నక్కా ప్రసాద్ వద్ద నుంచి కొంత డబ్బులు తీసుకున్నాడు. అయితే అతనికి ఎక్కడా ప్లాట్ చూపించకపోవడంతో డబ్బులు తిరిగి ఇవ్వాలని ప్రసాద్ నిలదీశాడు. ఇద్దరి మధ్య వాగ్వివాదం చోటు చేసుకుంది. ఈ ఘటనలో ప్రసాద్ కర్రలు, రాళ్లతో దాడిచేసి సురేష్‌ను తీవ్రంగా గాయపరచాడు. కేసు నమోదు చేసిన ఈస్ట్ పోలీసులు శనివారం నిందితుడు ప్రసాద్‌ను అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించారు.

28న సంస్కార శిబిరం

తిరుపతి(కల్చరల్), ఏప్రిల్ 26(ఆంధ్రజ్యోతి): తిరుపతి రామకృష్ణ మిషన్ ఆశ్రమం ఆధ్వర్యంలో ఈనెల 28 నుంచి మే 18 వరకు సంస్కార శిబిరం 2025 వేసవి తరగతులు నిర్వహిస్తున్నట్లు ఆశ్రమ కార్యదర్శి స్వామి సుకృతానంద తెలిపారు. 5 నుంచి 10వ తరగతి విద్యార్థులకు ప్రతిరోజూ ఉదయం 8.15 గంటలకు 12.15 గంటల వరకు తరగతులు ఉంటాయన్నారు. ఇతర వివరాలకు 9493107001, 6360150945కు సంప్రదించగలరు.



వీఐపీ కాటేజీలో నాగుపాము

తిరుమలలో వీఐపీలు బస చేసే స్పెషల్ టైప్ విశ్రాంతి భవనంలోని 14వ నెంబరు కాటేజీలోకి శనివారం ఐదున్నర అడుగుల నాగుపాము ప్రవేశించింది. భక్తులు భయంతో బయటకు వచ్చి భద్రతా సిబ్బందికి తెలియజేశారు. వెంటనే పాములు పట్టే టీటీడీ కాంట్రాక్ట్ ఉద్యోగి భాస్కర్ నాయుడు అక్కడికి చేరుకుని పామును పట్టుకుని అడవిలో విడిచిపెట్టారు.

- తిరుమల, ఆంధ్రజ్యోతి



శ్రీవారి పుష్కరిణిలో వేసవి సందడి

తిరుమల శ్రీవారి పుష్కరిణి భక్తులతో కిటకిటలాడుతోంది. సాధారణంగా తిరుమలకు చేరుకునే భక్తులు ముందుగా పుష్కరిణిలో స్నానమాచరించి, వరాహస్వామిని దర్శించుకున్న తర్వాత శ్రీవారిని దర్శించుకుంటారు. వేసవి కూడా తోడవడంతో ప్రస్తుతం పుష్కరిణి సందడిగా మారింది. చిన్నపిల్లల నుంచి వృద్ధుల వరకు పుష్కరిణిలో కనిపిస్తున్నారు.

- తిరుమల, ఆంధ్రజ్యోతి


సర్వదర్శనానికి 14 గంటలు

తిరుమల వేంకటేశ్వరస్వామి దర్శనానికి 14 గంటల సమయం పడుతోంది. శనివారం సాయంత్రం 5 గంటల వరకు ఉన్న సమాచారం మేరకు వైకుంఠం క్యూకాంప్లెక్స్ 2లోని కంపార్టుమెంట్లన్నీ సర్వదర్శన భక్తులతో నిండిపోయి క్యూలైన్ నారాయణగిరి ఉద్యానవనంలోని షెడ్ల వరకు వ్యాపించింది. వైకుంఠం క్యూకాంప్లెక్స్ 1లో 5 కంపార్టుమెంట్లలో టైంస్లాట్ భక్తులు వేచి ఉన్నారు.

గురువారం హుండీ ఆదాయం: రూ.3.37 కోట్లు

శుక్రవారం శ్రీవారిని దర్శించుకున్న భక్తులు: 64,536

తలనీలాలు సమర్పించినవారు: 30,612



కావు ఇవి చేటు..వెయ్యొద్దు వేటు

కోనోకార్పస్ చెట్లపై భిన్నవాదనలు

ఇవి పర్యావరణ హితమేనంటున్న జనవిజ్ఞాన వేదిక

నేడు ప్రెస్‌క్లబ్‌లో నిపుణులతో సమావేశం



తిరుపతి-ఆంధ్రజ్యోతి

'కోనోకార్పస్ చెట్లపై భిన్నవాదనలు వినిపిస్తున్నాయి. పశువులు తినవు. పిట్టలు వాలవు. పైగా ఆరోగ్యానికి కీడు కలిగిస్తాయి. జల వనరులను పీల్చేస్తాయి. పర్యావరణంతో పాటు మనుషులకూ హాని కలిగిస్తుందంటూ కొందరు చెబుతున్నారు. వీటితో ఏకీభవిస్తూ డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్ కూడా ఇటీవల కాకినాడలో వ్యాఖ్యానించారు. ఈ విదేశీ వృక్షాలను తొలగించాలని ఆయన ఆదేశించారు. ఈ చెట్లపై చేస్తున్న ప్రచారాలన్నీ అపోహలేనని, శాస్త్రీయంగా ఏదీ రుజువు కాలేదని కొన్ని వర్గాలంటున్నాయి. ఇప్పటికే చాలాచోట్ల ఈ చెట్లను తొలగించే ప్రయత్నం చేశారు. వృక్షశాస్త్ర నిపుణులే విరుద్ధమైన వాదనలు లేవనెత్తుతున్నారు. శాస్త్రీయమైన పరిశోధన లేకుండానే కోనోకార్పస్ చెట్లు తొలగించకూడదని హైకోర్టులో ప్రజాప్రయోజనాల వాజ్యం కూడా దాఖలైంది. ఈ నేపథ్యంలో ఆదివారం తిరుపతి ప్రెస్‌క్లబ్‌లో జనవిజ్ఞాన వేదిక ఆధ్వర్యంలో కొందరు నిపుణులు సశాస్త్రీయమైన ఆధారాలతో ఈ మొక్క విశిష్టత గురించి వివరించనున్నారు.

● నగరంలో పలుచోట్ల ఆకర్షణగా...

తుడా, నగరపాలక సంస్థ ఆధ్వర్యంలో తిరుపతిలో కూడా విరివిగా కోనోకార్పస్ చెట్లను నాటారు. విమానాశ్రయం, తుమ్మలగుంటమార్గం, రామానుజ సర్కిల్ నుంచి రిలయన్స్ మార్టు వద్ద రోడ్డుకు ఇరువైపులా ఈ చెట్లు కనిపిస్తాయి. పుష్పిడి దశకు రాకుండానే వీటిని శంఖు ఆకృతిలో కట్ చేస్తుంటారు. అందం, ఆకర్షణ, చిక్కటి పచ్చదనంతో కనిపిస్తుంటాయి. గార్డెనింగ్‌కు అనువుగా ఉంటుందని కొందరు ఇళ్ల వద్దా పెంచుకుంటున్నారు.

● యూకలిప్టస్ కన్నా కోనోకార్పస్ సేఫ్

కోనోకార్పస్ చెట్ల వేర్లు విస్తరించి పైపులైన్లు, గోడలను దెబ్బతీస్తాయని, విషవాయువులను విడుదల చేస్తాయనేవి అపోహలే. ఏ చెట్ల వేర్లయినా విస్తరిస్తే ఇలాంటి ఫలితాలే ఉంటాయి. కోనోకార్పస్ చెట్లు వాయు కాలుష్యాన్ని తగ్గిస్తాయి.వీటి ద్వారా వచ్చే నూనె యాంటీ ఆక్సిడెంట్‌గా పనిచేస్తుంది.మధుమేహాన్ని, వివిధ రకాల ఇన్ఫెక్షన్లను తగ్గిస్తుంది.ఎక్కువగా కార్బన్‌డైఆక్సైడ్ పీల్చుకుని ఆక్సిజన్ మరింత ఎక్కువగా విడుదల చేస్తుంది.ఈ వృక్షాలతో బహుళ ప్రయోజనాలు ఉన్నట్టు పరిశోధన పత్రాలు స్పష్టం చేస్తున్నాయి. కడప జిల్లాలో కొన్ని వందల ఎకరాలలో వీటిని పెంచుతున్నారు.

- మాధవశెట్టి, ప్రముఖ వృక్షశాస్త్ర నిపుణులు



ఏడుగురు సీఐల బదిలీ

● నలుగురు వీఆర్‌కు

తిరుపతి(నేరవిభాగం) ఏప్రిల్ 26(ఆంధ్రజ్యోతి): జిల్లాలో ఏడుగురు సర్కిల్ ఇన్‌స్పెక్టర్లను బదిలీ చేస్తూ శనివారం రాత్రి అనంతపురం డీఐజీ షిమోషీ ఉత్తర్వులు జారీ చేశారు. ఇందులో నలుగురిని వీఆర్‌కు బదిలీ చేశారు.రేణిగుంట రూరల్ సీఐ ఈ.మురళీకృష్ణ, శ్రీకాళహస్తి టూ టౌన్ సీఐ వెంకటేశ్వర్లను వీఆర్‌కు బదిలీ చేశారు. వీఆర్‌లో ఉన్న నాగార్జున రెడ్డిని శ్రీకాళహస్తి టూ టౌన్‌కు, ఏర్పేడు సీఐ జయచంద్రను రేణిగుంటకు, అక్కడ పనిచేస్తున్న శరత్‌చంద్రను వీఆర్‌కు, వీఆర్‌లో ఉన్న శ్రీకాంత్ రెడ్డిని ఏర్పేడుకు, డీఐజీ వీఆర్‌లో ఉన్న మంజునాథ రెడ్డిని తిరుపతి ఎస్పీ వీఆర్‌కు బదిలీ చేశారు. వీరందరూ తక్షణం రిలీవ్ అయి వారికి కేటాయించిన స్థానాల్లో జాయిన్ కావాలని ఉత్తర్వుల్లో పేర్కొన్నారు.

సంక్షేమ వసతిగృహ టాపర్లకు అభినందనలు

తిరుపతి(కలెక్టరేట్), ఏప్రిల్ 26(ఆంధ్రజ్యోతి): జిల్లాలోని ఎస్సీ సంక్షేమ వసతిగృహాల్లో పదవ తరగతి, ఇంటర్మీడియట్ విద్యను అభ్యసించి టాపర్లుగా నిలిచిన విద్యార్థులను కలెక్టర్ వెంకటేశ్వర్ శనివారం అభినందించారు. పదిలో 586 వరకు మార్కులు సాధించిన విశ్వనాథ్, హనుమంత్, భావన, భగీరథ్, నీలకుమార్, భానుశ్రీ, గుణశేఖర్, దీపేష్, ఇంటర్‌లో 900లకు పైగా మార్కులు సాధించి టాపర్లుగా నిలిచిన హైమావతి, నీలావతి, లక్ష్మీప్రసన్న, యువశ్రీ, రాజు, సంజయ్‌ను కలెక్టర్ అభినందించారు. వారికి ప్రశంసాపత్రాలతోపాటు అబ్దుల్‌కలాం ఆత్మకత పుస్తకాలను అందజేశారు. క్రమశిక్షణతో విద్యను అభ్యసించి ఉన్నత శిఖరాలకు ఎదగాలకి విద్యార్థులకు కలెక్టర్ సూచించారు. జిల్లా సాంఘిక సంక్షేమాధికారి విక్రమ్‌కుమార్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.



ప్రతిభ చూపిన విద్యార్థులతో కలెక్టర్ వెంకటేశ్వర్

దివ్యారామంలో చెట్ల నరికివేతపై విచారణాధికారి నియామకం

అమరావతి, ఏప్రిల్ 26 (ఆంధ్రజ్యోతి): తిరుపతిలోని దివ్యారామం ఎకో పార్క్‌లో నిబంధనలకు విరుద్ధంగా చెట్ల నరికివేతపై ప్రభుత్వం విచారణకు ఆదేశించింది. విచారణాధికారిగా పీసీసీఎఫ్(ప్రొడక్షన్) పీవీ చలపతిరావును నియమిస్తూ అటవీశాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి అనంతరాము శనివారం ఉత్తర్వులు జారీ చేశారు. దివ్యారామంలో చెట్ల నరికివేత కార్యకలాపాల్లో పాల్గొన్న అధికారుల పాత్రను నిర్ధారించడం, ఈ ఉదంతంపై విచారణ నిర్వహించాలని ఉత్తర్వుల్లో పేర్కొన్నారు. ఈనెల 30లోగా ప్రభుత్వానికి వివరణాత్మక నివేదిక సమర్పించాలని విచారణాధికారిని ఆదేశించారు. కాగా దివ్యారామంలో చెట్ల నరికివేతపై ఉపముఖ్యమంత్రి పవన్‌కళ్యాణ్ సీరియస్ అవడంతో అటవీశాఖ విచారణకు ఆదేశించింది.

'మనోళ్ల దగ్గర ఉండుంటాడులే' అనుకుని..

● దర్శనానికి వెళ్లిపోయిన తల్లిదండ్రులు

● గుర్తించి అప్పగించిన తిరుమల పోలీసులు

తిరుమల, ఏప్రిల్ 26(ఆంధ్రజ్యోతి): రాత్రి తప్పిపోయిన ఆరేళ్ల పిల్లాడిని తిరుమల పోలీసులు ఉదయానికల్లా గుర్తించి తల్లిదండ్రులకు అప్పగించారు. కర్ణాటకలోని కాడెనందిహల్లికి చెందిన శేఖరప్ప, రేణుక దంపతులు ముగ్గురు పిల్లలు, మరికొంతమంది కుటుంబ సభ్యులతో కలిసి శ్రీవారి దర్శనం కోసం శుక్రవారం ఉదయం తిరుమలకు వచ్చారు. రాత్రి 8 గంటల సమయంలో తిరుమలలోని యాత్రికుల వసతి సముదాయం 2 వద్ద టీ తాగారు. ఆ సమయంలో శేఖరప్ప ఆరేళ్ల చిన్న కుమారుడు మాన్విత్ కనిపించలేదు. తమ బంధువులతో కలిసి దర్శనానికి వెళ్లి ఉంటాడని భావించిన తల్లిదండ్రులు దర్శనానికి వెళ్లారు. వెనక్కి వచ్చి చూస్తే పిల్లాడు కనిపించలేదు. గాలించినా దొరక్కపోవడంతో టీటీడీ బ్రాడ్ కాస్టింగ్ ద్వారా శనివారం ఉదయం ప్రచారం చేయించారు. యాత్రికుల సముదాయంలోని 4వ నెంబరు హాల్‌లో ఆరేళ్ల మాన్విత్‌ను గుర్తించిన పోలీసులు తల్లిదండ్రులకు అప్పగించారు.



మాన్విత్‌ను తల్లిదండ్రులకు అప్పగిస్తున్న పోలీసులు

అలిగివచ్చిన మహిళ అప్పగింత

ఇంటి నుంచి అలిగి తిరుమలకు వచ్చిన ఓ మహిళను తిరుమల పోలీసులు తిరిగి కుటుంబ సభ్యులకు అప్పగించారు. విశాఖపట్నంకు చెందిన రమ్యరాజు(40) ఇంట్లో గొడవలతో మనస్థాపం చెంది 24వ తేదీన ఇంటి నుంచి తిరుమలకు చేరుకుంది. కుటుంబ సభ్యులు ఆందోళన పడుతుండగా శుక్రవారం ఉదయం 9.30 గంటలకు వారికి ఫోన్ చేసి, తిరుమలలో ఉన్నట్టు చెప్పింది. కుటుంబ సభ్యులు వెంటనే తిరుమల పోలీసులకు సమాచారం ఇచ్చారు. ఫోన్ నెంబరు ఆధారంగా వైకుంఠం క్యూకాంప్లెక్స్ వద్ద ఆ మహిళను గురించి అదుపులోకి తీసుకున్నారు. శనివారం ఉదయం తిరుమలకు చేరుకున్న కుటుంబ సభ్యులకు రమ్యరాజును పోలీసులు అప్పగించారు.

సిద్ధయ్య కుటుంబానికి పరిహారం



సిద్ధయ్య అంత్యక్రియలు



సిద్ధయ్య కుటుంబానికి ఆర్థిక సహాయం చేస్తున్న టీడీపీ నేతలు

భాకరాపేట, ఏప్రిల్ 26(ఆంధ్రజ్యోతి): ఏనుగు దాడిలో అశువులు బాసిన సిద్ధయ్య(72) అంత్యక్రియలను శనివారం స్వగ్రామం దాసరి గూడెంలో నిర్వహించారు. సిద్ధయ్య కుటుంబానికి డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్ రాష్ట్ర ప్రభుత్వం తరఫున రూ.10 లక్షలు పరిహారం ప్రకటించినట్లు చంద్రగిరి నియోజకవర్గ జనసేన ఇన్‌చార్జ్ దేవర మనోహర్ తెలిపారు. శనివారం సిద్ధయ్య అంత్యక్రియల్లో పాల్గొని ఆయన కుటుంబ సభ్యులకు ప్రగాఢ సానుభూతి తెలిపారు. చంద్రగిరి ఎమ్మెల్యే పులివర్తి నాని ఫోన్ ద్వారా సిద్ధయ్య కుటుంబ సభ్యులను పరామర్శించారు. సిద్ధయ్య దహన సంస్కారాలకు రూ.25 వేల ఆర్థిక సహాయాన్ని పార్టీ నాయకులతో పంపించారు. సర్పంచ్ నాగచెంగమనాయుడు, టీడీపీ నాయకులు మోహన్‌రెడ్డి, చాంద్‌బాషా, సహదేవరెడ్డి, చంద్రశేఖర్‌రెడ్డి, రవీందర్‌రెడ్డి పాల్గొన్నారు.

తాగునీటి ఎద్దడి లేకుండా చర్యలు తీసుకోవాలి

తిరుపతి(కలెక్టరేట్), ఏప్రిల్ 26(ఆంధ్రజ్యోతి): జిల్లాలో పట్టణాలు, గ్రామాల్లో నీటిఎద్దడి తలెత్తకుండా చర్యలు తీసుకోవాలని మున్సిపల్ కమిషనర్లను కలెక్టర్ వెంకటేశ్వర్ ఆదేశించారు. కలెక్టరేట్‌లో శనివారం వివిధ అంశాలపై మున్సిపల్ కమిషనర్లతో సమీక్షించారు. నీటి సమస్య ఉన్న ప్రదేశాల్లో ట్యాంకర్ల ద్వారా నీటిని అందించాలన్నారు. అలాగే తడిచెత్త, పొడిచెత్త వేరు చేసి డంపింగ్‌యార్డుకు తరలించాలన్నారు. ఈ కార్యక్రమంలో గూడూరు, సూళ్లూరుపేట, నాయుడుపేట, వెంకటగిరి, శ్రీకాళహస్తి మున్సిపల్ కమిషనర్లు పాల్గొన్నారు.



భక్తజనసంద్రంగా ముక్కంటి ఆలయం

శ్రీకాళహస్తి, ఏప్రిల్ 26(ఆంధ్రజ్యోతి): శ్రీకాళహస్తీశ్వరాలయం శనివారం భక్తులతో కిక్కిరిసింది. వేసవి సెలవులు, శని త్రయోదశి కావడంతో ఉభయ తెలుగు రాష్ట్రాల నుంచే కాకుండా ఇతర రాష్ట్రాల నుంచి భక్తులు పెద్దసంఖ్యలో తరలివచ్చారు. సుమారు 30 వేలమంది భక్తులు దర్శించుకున్నట్లు ఆలయాధికారులు తెలిపారు.

షిర్డిసాయి ఎలక్ట్రికల్స్‌కు భూ కేటాయింపుపై సమగ్ర విచారణ చేయండి

● డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్ ఆదేశం

తిరుపతి, ఏప్రిల్26(ఆంధ్రజ్యోతి): షిరిడీ సాయి ఎలక్ట్రికల్స్ కంపెనీకి చెందిన భూములు శేషాచలం వైల్డ్‌లైఫ్ రిజర్వ్ ఫారెస్ట్ పరిధిలోకి వస్తాయని మీడియాలో వచ్చిన కథనాలపై తక్షణం నివేదిక ఇవ్వాలని ఉప ముఖ్యమంత్రి, అటవీ పర్యావరణ శాఖ మంత్రి పవన్ కల్యాణ్ అధికారులను ఆదేశించారు. షిరిడీ సాయి కంపెనీకి కేటాయించిన భూముల్లో అటవీ భూముల క్రమబద్ధీకరణ చట్టం 1980 నిబంధనలు పూర్తిగా గాలికి వదిలేశారని వచ్చిన మీడియా కథనాలను పవన్ పరిశీలించి అధికారులతో సమీక్షించారు. భూ కేటాయింపులు, సంబంధిత వివరాలు నివేదిక రూపంలో అందజేయాలని, కేటాయింపుల ప్రక్రియపైనా వివరాలు ఇవ్వాలని ఆయన ఆదేశించారు. తిరుపతిలోని శేషాచలం అడవులకు ఆనుకుని ఉన్న ఉపాధ్యాయనగర్ గ్రాండ్ వరల్డ్ రోడ్డులో అటవీ సరిహద్దు కంచె ధ్వంసం కావడంతో వన్యప్రాణులు దప్పిక కోసం, తిండి కోసం బయటకు వస్తూ ప్రాణాపాయ పరిస్థితిలోకి వెళ్తున్నాయని సామాజిక మాధ్యమాల్లో వచ్చిన వివరాలు చూసి ఆయన ఆవేదన వ్యక్తం చేశారు. దీనిపై వెంటనే తగు చర్యలు తీసుకోవాలని తిరుపతి అటవీ, బయోటెక్నాలజీ రీసెర్చ్ సెంటర్ పరిధిలో ఉన్న ఫెన్సింగ్‌కు తగిన మరమ్మతులు చేయాలని అటవీ అధికారులను ఆదేశించారు.

కాలువలోకి దూసుకెళ్లిన బస్సు

● పలువురు కార్మికులకు గాయాలు





గాయపడిన వారిని ఆస్పత్రికి తరలిస్తున్న దృశ్యం

వరదయ్యపాళెం, ఏప్రిల్ 26(ఆంధ్రజ్యోతి): పరిశ్రమకు కార్మికులను తరలిస్తున్న ఓ బస్సు కాలువలోకి దూసుకెళ్లింది. ఈ ఘటనలో పలువురు కార్మికులకు స్వల్ప గాయాలయ్యాయి. నాగలాపురం మండలం వేంబాక్కం పంచాయతీ హరిజనవాడ సమీపంలో ఈ ప్రమాదం జరిగింది. శ్రీసిటీలోని ఓ పరిశ్రమకు చెందిన బస్సు నాగలాపురం నుంచి కార్మికులను తీసుకెళ్తుండగా వేంబాక్కం వద్ద అదుపు తప్పి రోడ్డు పక్క ఉన్న కాలువలోకి దూసుకెళ్లింది. బస్సులోని 35మంది ప్రయాణికుల్లో 22 మందికి స్వల్ప గాయాలు, డ్రైవర్‌కు తీవ్ర గాయాలయ్యాయి. సమాచారం అందుకున్న ఎస్ఐ సునీల్ సిబ్బందితో ఘటనా స్థలానికి చేరుకుని క్షతగాత్రులను నాగలాపురం ప్రాథమిక ఆరోగ్య కేంద్రానికి తరలించారు. తొమ్మిదిమందిని మెరుగైన వైద్యం కోసం నగరి ఏరియా ఆస్పత్రికి రెఫర్ చేశారు. ఎమ్మెల్యే ఆదిమూలం బాధితులను ఫోన్‌లో పరామర్శించారు. మెరుగైన వైద్యం అందించాలని వైద్యులను కోరారు.

శ్రీసిటీ సెజ్ దేశానికి ఉత్తమ నమూనా



మాజీ అధికారుల బృందంతో శ్రీసిటీ ఎండీ

శ్రీసిటీ, ఏప్రిల్ 26 (ఆంధ్రజ్యోతి): సెజ్ పాలసీ లక్ష్యాలకనుగుణంగా అభివృద్ధి చెందిన శ్రీసిటీ పారిశ్రామికవాడ దేశానికి ఉత్తమ నమూనాగా కేంద్ర వాణిజ్య శాఖ మాజీ ముఖ్య కార్యదర్శి జి.కె.పిళ్లై అభివర్ణించారు. దేశంలో సెజ్‌ల రూపకల్పనలో కీలక పాత్ర పోషించిన పలువురు కేంద్ర ప్రభుత్వ మాజీ ఉన్నతాధికారులు శ్రీసిటీని సందర్శించారు. దేశంలో సెజ్‌లు స్థాపించి 20 ఏళ్లు పూర్తయిన సందర్భంగా ఈ పర్యటన ప్రత్యేకతను సంతరించుకుంది. జి.కె.పిళ్లై ఆధ్వర్యంలో విచ్చేసిన బృందానికి శ్రీసిటీ ఎండీ డాక్టర్ రవీంద్ర సన్నారెడ్డి సాదర స్వాగతం పలికారు. శ్రీసిటీ ఏర్పాటు నుంచి ఇప్పటి వరకు సాధించిన విజయాలు, ప్రగతిని వివరించారు. శ్రీసిటీ పరిసరాల సందర్శన అనంతరం వివిధ పరిశ్రమల ప్రతినిధులతో నిర్వహించిన ప్రత్యేక చర్చా కార్యక్రమంలో పాల్గొన్నారు. శ్రీసిటీ ఎండీ మాట్లాడుతూ సెజ్ పాలసీ మార్గదర్శకులు శ్రీసిటీ పర్యటనకు రావడం పట్ల సంతోషం వ్యక్తం చేశారు. శ్రీసిటీ ఏర్పాటు సమయంలో అందించిన ప్రోత్సాహం, సహకారానికి కృతజ్ఞతలు తెలిపారు. జి.కె.పిళ్లై మాట్లాడుతూ... బంజరు భూమి నుంచి అద్భుత పారిశ్రామిక నగరంగా శ్రీసిటీ రూపాంతరం చెందడం ఆశ్చర్యానికి గురి చేసిందన్నారు. శ్రీసిటీలో పెట్టుబడులు - స్నేహపూర్వక వాతావరణ వ్యవస్థను సీబీఐసీ మాజీ సభ్యుడు యోగేంద్ర గార్గ్ కొనియాడారు. అనంతరం అధికారుల బృందం ట్రిపుల్ ఐటీకి వెళ్లి అక్కడ విద్యార్థులు, అధ్యాపకులతో చర్చాగోష్ఠిలో పాల్గొన్నారు. పర్యటన బృందంలో గోవా మాజీ చీఫ్ సెక్రటరీ బి.విజయన్, ఐటీఎస్ మాజీ అధికారి ఎల్.బి.సింఘాల్, ఇండస్ట్రియల్ పార్క్, వేర్ హౌసింగ్ మండలి మాజీ కో-చైర్మన్ హితేంద్ర మెహతా తదితరులు పాల్గొన్నారు.

తిరుపతిలో ముమ్మరంగా తనిఖీలు

జనసంద్ర ప్రాంతాలను జల్లెడ పట్టిన భద్రతా దళాలు



తిరుపతి(నేరవిభాగం) ఏప్రిల్ 26(ఆంధ్రజ్యోతి): జమ్మూకశ్మీర్‌లోని పహల్గామ్‌లో ఉగ్రదాడి నేపథ్యంలో పోలీసులు అప్రమత్తమయ్యారు. తిరుపతి నగరంలో భక్తుల రద్దీ ఎక్కువగా ఉన్న ప్రాంతాల్లో ముమ్మరంగా తనిఖీలు చేస్తున్నారు. ఆర్టీసీ బస్టాండు, రైల్వేస్టేషన్, టీటీడీ వసతి గృహాలు, అలిపిరి చెక్ పాయింట్ల వద్ద శనివారం తనిఖీలు చేశారు. అనుమానమున్న ప్రతి ఒక్కరినీ విచారణ జరిపి, వివరాలు సేకరించారు. మరో వైపు బాంబు డిస్పోజల్ స్క్వాడ్‌లు రైల్వేస్టేషన్‌లోని అన్ని ప్లాట్‌ఫారాలను తనిఖీ చేశాయి. పార్సిల్ కార్యాలయం వద్ద డాగ్ స్క్వాడ్లు తనిఖీ చేశాయి. సెంట్రల్ బస్టాండులోని చెన్నై ప్లాట్‌ఫారం వద్ద అనుమానంగా తిరుగుతున్న వారిని అదుపులోకి తీసుకుని విచారిస్తున్నారు. తిరుపతికి వచ్చే ప్రయాణికులను భారతి బస్టాండు వద్ద మెటల్ డిటెక్టర్లతో తనిఖీలు చేశారు. లగేజీ కేంద్రాలు, కొరియర్ కార్యాలయాలు, లాజిస్టిక్స్ ఆఫీసుల్లో అణువణువూ పరిశీలించారు. దీంతోపాటు నగరంలో డ్రోన్ నిఘా పెంచారు.

చేపలు పట్టేందుకు వెళ్లి మృత్యువాత

కోట, ఏప్రిల్ 26 (ఆంధ్రజ్యోతి): స్వర్ణముఖి నదిలో చేపలు పట్టేందుకు వెళ్లిన వ్యక్తి ఇసుకలో కూరుకుపోయి మృతి చెందిన ఘటన కోట మండలంలో జరిగింది. స్థానికుల కథనం మేరకు.... తిన్నెలపూడి పంచాయతీలోని లక్ష్మమ్మకండ్రిగ అరుంధతివాడకు చెందిన పారిచర్ల సుబ్రహ్మణ్యం(40) శనివారం ఇద్దరు స్నేహితులతో కలిసి తాటితోపు వద్ద రంపపు కోత పనులకు వెళ్లాడు. మధ్యాహ్నం పనులు ముగించుకుని సమీపంలో ఉన్న స్వర్ణముఖి నదిలోని వెళ్లారు. సుబ్రహ్మణ్యం చేపలు పట్టేందుకు నది మధ్యలోకి వెళ్లగా ప్రమాదవశాత్తు ఇసుకలో కూరుకుపోయాడు. వెంటనే అతని స్నేహితులు ఇద్దరూ లక్ష్మక్క కండ్రిగలోకి వెళ్లి జరిగిన విషయం చెప్పడంతో గ్రామస్తులంతా వచ్చి ఇసుకలో కూరుకుపోయిన సుబ్రహ్మణ్యంను బయటకు లాగగా అప్పటికే మృతిచెందాడు. మృతుడికి భార్య, ఇద్దరు పిల్లలు ఉన్నారు.



మృతిచెందిన సుబ్రహ్మణ్యం

నేడు విద్యుత్ బిల్లులు చెల్లించవచ్చు

తిరుపతి(ఆటోనగర్)ఏప్రిల్ 26, (ఆంధ్రజ్యోతి): తిరుపతి విద్యుత్ టౌన్ డివిజన్ పరిధిలో వినియోగదారులు తమ విద్యుత్ బిల్లులు ఆదివారం తమ రెవెన్యూ కార్యాలయాల్లో చెల్లించవచ్చని ఆ డివిజన్ ఈఈ చంద్రశేఖర్ రావు తెలిపారు. ఉదయం 9 నుంచి మధ్యాహ్నం ఒంటి గంట వరకు సిబ్బంది పని చేస్తారని తెలియజేశారు. ఈ అవకాశాన్ని విద్యుత్ వినియోగదారులు సద్వినియోగం చేసుకోవాలని కోరారు.


వరి పొలాల మీదుగా మృతదేహాన్ని మోసుకెళ్తున్న కానూరు గ్రామస్తులు(ఫైల్‌ఫొటో)

ఆఖరి మజిలీకి అవస్థలు

శ్మశానవాటికలకు దారి లేక ఇబ్బందులు

పెళ్లకూరు, ఏప్రిల్ 26 (ఆంధ్రజ్యోతి): మనిషి జీవితంలో ఆఖరి మజిలీ అయిన అంత్యక్రియలను నిర్వహించడానికి కూడా పెళ్లకూరు మండలంలోని పలు గ్రామాల్లో ఇబ్బందులు ఎదురవుతున్నాయి. అక్కగారిపేట, కానూరు, రావులపాడు తదితర గ్రామాల్లో మృతదేహాలను శ్మశానవాటికకు తీసుకెళ్లేందుకు దారిలేక పడుతున్న ఆయా గ్రామాల ప్రజల బాధలు వర్ణనాతీతం. ఊరికి దూరంగా ఉన్న శ్మశానవాటికకు వెళ్లాలంటే పంట పొలాల గట్లు మీదుగా పడిలేస్తూ మృతదేహాలను తీసుకెళ్లాల్సి వస్తోంది. ముఖ్యంగా వర్షాకాలంలో మృతదేహాలను తరలించి అంత్యక్రియలు నిర్వహించేందుకు ప్రజలు పడరాని పాట్లు పడుతున్నారు. శ్మశానవాటికలు కూడా కంపచెట్లతో నిండిపోయి ఉండడంతో దహన కార్యక్రమాలకు అవస్థలు పడాల్సి వస్తోందని ప్రజలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. అధికారులు, పాలకులు స్పందించి శ్మశాన వాటికలకు దారి సౌకర్యం కల్పిండంతో పాటు కంపచెట్లు, వ్యర్థాలను తొలగించి తగిన వసతులు కల్పించాలని ప్రజలు కోరుతున్నారు.

4నుంచి పోలేరమ్మ జాతర


పోస్టర్లను ఆవిష్కరిస్తున్న ఎమ్మెల్యే విజయశ్రీ, నెలవల సుబ్రహ్మణ్యం

నాయుడుపేట టౌన్, ఏప్రిల్ 26(ఆంధ్రజ్యోతి) నాయుడుపేట పట్టణంలోని గడియారం సెంటర్ వద్ద వెలసిన గ్రామదేవత పోలేరమ్మ జాతరను వచ్చే నెల 4వ తేదీనుంచి నిర్వహించనున్నట్లు సూళ్లూరుపేట ఎమ్మెల్యే డాక్టర్ నెలవల విజయశ్రీ తెలిపారు. ఇందుకు సంబంధించిన పోస్టర్లను ఎమ్మెల్యే విజయశ్రీ, నియోజకవర్గ ఇన్‌చార్జి నెలవల సుబ్రహ్మణ్యం పట్టణంలోని టీడీపీ కార్యాలయంలో శనివారం రాత్రి ఆవిష్కరించారు. 4,5 తేదీల్లో ఘటోత్సవం, 6వ తేదీ రాత్రి అమ్మరాత్రి నిలుపు, 7న అమ్మవారి జాతర, అదేరోజు రాత్రి అమ్మవారి సాగనంపు ఉత్సవం నిర్వహించనున్నట్లు దేవదాయశాఖ ఈవో రవికృష్ణ తెలిపారు. కార్యక్రమంలో జాతర కమిటీ అధ్యక్షుడు నానాపాల సుబ్బారావు, మణి, అరవభూమి శ్రీనివాసులు రెడ్డి, గోపి, శ్రీనివాసులు, కృష్ణారెడ్డి, నారాయణ, రవి, వెంకటేశ్వర్లు, ధనుంజయ, మస్తాన్, అశోక్, రామారావు, సాయిరామ్ తదితరులు పాల్గొన్నారు.

వైభవంగా ధర్మరాజస్వామి ఉత్సవాలు


విద్యుత్ దీపాలకరణలో ధర్మరాజస్వామి ఆలయ ప్రాంగణం

తడ, ఏప్రిల్ 26 (ఆంధ్రజ్యోతి): మండలంలోని వాటంబేడుకుప్పం గ్రామంలో ఉన్న పంచపాండవ ద్రౌపదీ సమేత ధర్మరాజస్వామి ఉత్సవాలు వైభవంగా జరుగుతున్నాయి. శనివారం ఉదయం స్వామివార్లకు ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం హిడింబి వధ కార్యక్రమాన్ని నిర్వహించారు. రాత్రి మహాభారతం ప్రథమ ఘట్టం అయిన భకాసుర వధ జరిగింది. భీమసేనుడు భకాసురుడిని వధించే సన్నివేశం ఆకట్టుకుంది. అనంతరం గ్రామోత్సవం నిర్వహించారు. సాంస్కృతిక కార్యక్రమాల్లో భాగంగా తమిళనాడుకు చెందిన సెలం శరవణ బృందం పాటకచ్చేరితో అలరించగా, దివాకర్ బృందం ఆటపాటలతో ఉర్రూతలూగించింది.

మత్స్యకారులకు అండగా నిలిచేది టీడీపీనే


ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు ఫ్లెక్సీకి పాలాభిషేకం చేస్తున్న టీడీపీ నాయకులు, మత్స్యకారులు

చిల్లకూరు, ఏప్రిల్ 26 (ఆంధ్రజ్యోతి): మత్స్యకారులకు అండగా ఉంటూ వారి అభ్యున్నతికి తోడ్పాటునందించేది టీడీపీనేనని తెలుగు యువత అధికార ప్రతినిధి సతీష్ యాదవ్ అన్నారు. చేపల వేట నిషేధ కాలానికి మత్స్యకార భరోసా కింద రూ.20వేలు ప్రభుత్వం అందజేసిన సందర్భంగా శనివారం మండలంలోని గుమ్మళ్లదిబ్బ గ్రామంలో ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు ఫ్లెక్సీకి మత్స్యకారులు పాలాభిషేకం చేశారు. ఈ సందర్భంగా సతీష్ యాదవ్ మాట్లాడుతూ ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీ ప్రకారం మత్స్యకారులకు మత్స్యకార భరోసా నగదు రూ.20 వేలు అందజేయడం జరిగిందన్నారు. కార్యక్రమంలో మత్స్యకార నాయకులు రామయ్య, వెంకయ్య, సుబ్రహ్మణ్యం, నాగూర్‌బాబు, పోలయ్య, మస్తాన్, పవన్, మౌల పాల్గొన్నారు.

కేంద్ర ప్రభుత్వ బీమా పథకాలపై అవగాహన


ఉపాధి కూలీలతో మాట్లాడుతున్న ఎంపీడీవో మనోహర్ గౌడ్

చిట్టమూరు, ఏప్రిల్ 26(ఆంధ్రజ్యోతి): కేంద్ర ప్రభుత్వం అమలు చేస్తున్న బీమా పథకాలపై ఉపాధి హామీ కూలీలకు శనివారం ఎంపీడీవో మనోహర్ గౌడ్ అవగాహన కల్పించారు. మండలంలోని పల్లంపర్తి గ్రామంలో ఉపాధి పనులు చేస్తున్న కూలీలతో ఆయన మాట్లాడారు. ప్రధానమంత్రి జీవన జ్యోతి బీమా యోజన, ప్రధానమంత్రి సురక్ష బీమా యోజన పథకాల గురించి వివరించారు. ఎండ తీవ్రంగా ఉండడంతో ఉదయాన్నే పని చేసుకోవాలని సూచించారు. పని ప్రదేశంలో షెల్టర్ ఏర్పాటు, తాగునీరు కూలీలకు అందించాలని ఉపాధి సిబ్బందికి సూచించారు.

నేడు విద్యుత్ సరఫరాలో అంతరాయం

సూళ్లూరుపేట, ఏప్రిల్ 26 (ఆంధ్రజ్యోతి): సూళ్లూరుపేటలోని మన్నెముత్తేరి సబ్‌స్టేషన్‌లో మరమ్మతుల కారణంగా ఆదివారం ఉదయం 7 గంటల నుంచి 10 గంటల వరకు కోళ్లమిట్ట, డేగపాలెం, షార్ జైజంక్షన్, గవర్నమెంట్ ఆస్పత్రి రోడ్డు, రామవయ్యపేట తదితర ప్రాంతాల్లో విద్యుత్ సరఫరా ఉండదని ఈడీఈ శేఖర్ తెలిపారు.

లారీ ఢీకొని మహిళకు తీవ్రగాయాలు


గాయపడిన నవ్య

నాయుడుపేట టౌన్, ఏప్రిల్ 26 (ఆంధ్రజ్యోతి): నాయుడుపేట విన్నమాల జాతీయ రహదారి సమీపంలో లారీ ఢీకొని మహిళకు తీవ్ర గాయాలయ్యాయి. నెల్లూరు పట్టణానికి చెందిన నవ్య స్కూటీలో వెళుతుండగా నాయుడుపేట జాతీయ రహదారి సమీపంలో లారీలో ఇనుప ఊచలు మహిళ తలకు తగలడంతో గాయాలయ్యాయి. క్షతగాత్రురాలు అపస్మారక స్థితిలోకి వెళ్లింది. సమాచారం అందుకున్న 108సిబ్బంది నాయుడుపేట ప్రభుత్వాస్పత్రికి తరలించారు. ప్రథమ చికిత్స అనంతరం మెరుగైన వైద్యం కోసం నెల్లూరుకు తీసుకెళ్లారు. పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.



కోట మండలం గున్నంపడియ వద్ద పూర్తిగా ఎండిపోయిన సొనకాలువ - యమదిన్నెపాళెం వద్ద అడుగంటిన దృశ్యం

అడుగంటిపోతున్న సొనకాలువలు

తీరం ప్రాంతాలకు పొంచిఉన్న నీటి ఎద్దడి ముప్పు

కోట, ఏప్రిల్ 26 (ఆంధ్రజ్యోతి): కొన్ని దశాబ్దాలుగా సముద్రతీర ప్రాంత వాసుల కల్పతరువులైన సొనకాలువలు తడి ఆరుతున్నాయి. తీరం ప్రాంతాలకు తాగు, సాగునీరు అందించే జలధారలు కన్నీటి ధారలవుతున్నాయి. సొన కాలువల్లో భూగర్భ జలాలు పూర్తిగా అడుగంటి పోతుండడంతో తీరం ప్రాంతాలకు ప్రమాదం పొంచి ఉందనే చెప్పాలి. కోట, చిల్లకూరు మండలాల్లో దాదాపుగా 82 సొనకాలువలు ఉన్నాయి. ఇసుక, సిలికాతో కప్పబడి ఉండే సొనకాలువలు భూగర్భ జలాలతో ఎప్పుడూ కళకళలాడుతుండేవి. ఒకటి నుంచి ఐదు అడుగుల లోపే నీరు లభిస్తుండడంతో తీర ప్రాంతాలకు కల్పతరువులుగా ఉండేవి. వర్షాలు పడకపోయినా సొన కాలువల్లో మాత్రం జలధార పుష్కలంగా ఉండే ఈ సొనకాలువలను ఆధారం చేసుకుని వేరుశనగ, పుచ్చ, వరి పంటలను సాగుచేసేవారు. అయితే ఈ ఏడాది కోట మండలంలోని యమదిన్నెపాళెం, గున్నంపడియ, కొత్తపట్నం, శ్రీనివాసస్రతం, కర్లపూడి గ్రామాల్లో ఉన్న సొనకాలువలు పూర్తిగా అడుగంటిపోయాయి. భూగర్భ జలాలు దాదాపుగా పడిపోయాయి. దీంతో సముద్రతీరం వెంబడి ఉన్న సుమారు 15 గ్రామాలకు జల గండం తప్పదని ప్రజలు ఆందోళన చెందుతున్నారు.

రీ సర్వే సమగ్రంగా నిర్వహించాలి



సమావేశంలో మాట్లాడుతున్న ఆర్డీవో కిరణ్మయి, పక్కన రెవెన్యూ అధికారులు

సూళ్లూరుపేట, ఏప్రిల్ 26 (ఆంధ్రజ్యోతి): రైతులందరి సమక్షంలో రీసర్వే సమగ్రంగా నిర్వహించాలని ఆర్డీవో కిరణ్మయి అన్నారు. శనివారం సూళ్లూరుపేటలోని సత్యసాయి కల్యాణ మండపంలో రెండో విడత రీసర్వేపై డివిజన్ స్థాయి రెవెన్యూ అధికారులు, సిబ్బందితో సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆర్డీవో మాట్లాడుతూ రెండో విడతలో 15 గ్రామాలను రీ సర్వేకు ఎంపిక చేశామన్నారు. అధికారులు, సిబ్బంది సమన్వయంతో రీ సర్వేను సమగ్రంగా నిర్వహించాలన్నారు. రీ సర్వే నిర్వహించే గ్రామాల్లో ముందస్తుగా రైతులకు, గ్రామస్తులకు సమాచారం ఇవ్వాలన్నారు. తొలి విడతలో జరిగిన అనుభవాలను దృష్టిలో పెట్టుకుని సమర్థవంతంగా గడువులోగా పూర్తి చేయాలని సూచించారు. ప్రతి గ్రామంలో 200నుంచి 250 ఎకరాల వరకు ఒక బ్లాక్‌గా ఏర్పాటు చేసుకొని సర్వే నిర్వహించనున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో సూళ్లూరుపేట, తడ, దొరవారిసత్రం, నాయుడుపేట తహసీల్దార్లు నరహింహారావు, శరత్, శైలాకుమారి, రాజేంద్ర, రెవెన్యూ సిబ్బంది పాల్గొన్నారు.

విద్యార్థినికి సత్కారం


ఇంద్రజను సత్కరిస్తున్న ఉపాధ్యాయ సంఘాల నాయకులు

డక్కిలి, ఏప్రిల్ 26(ఆంధ్రజ్యోతి): డక్కిలి మండలం చాపలపల్లి గ్రామానికి చెందిన కలపాటి ఇంద్రజ పదో తరగతి పరీక్షల్లో 594 మార్కులు సాధించి జిల్లాటాపర్‌గా నిలిచింది. ఈ విద్యార్థిని శనివారం మహాజన ఉపాధ్యాయ సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి దూడల పెంచలయ్య, యూటీఎఫ్ నాయకుడు వులకంటా రామయ్య చాపలపల్లి గ్రామానికి వెళ్లి ఇంద్రజ శాలువాతో సత్కరించారు. ఇంగ్లీషు డిక్షనరీ అందజేశారు. స్వీట్లు పంచిపెట్టారు. భవిష్యత్తులో ఉన్నతస్థాయికి ఎదగాలని ఆకాంక్షించారు.

పేదలకు నిత్యావసరాల పంపిణీ


నిత్యావసరాలు పంపిణీ చేస్తున్న ప్రగతిసేవాసంస్థ సభ్యులు

గూడూరు, ఏప్రిల్ 26 (ఆంధ్రజ్యోతి): స్థానిక బాలాజీనగర్‌లోని ప్రగతి సేవాసంస్థ కార్యాలయంలో శనివారం పొనకా మల్లికార్జున్‌రెడ్డి సహకారంతో పేదలకు నిత్యావసరాలు పంపిణీ చేశారు. కార్యక్రమంలో సంస్థ అధ్యక్షుడు కడివేటి చంద్రశేఖర్, శ్రీనివాసులు, రాము, శివకుమార్‌రెడ్డి, ప్రభాకర్, కరీముల్లా, వెంకటేశ్వర్లు, నాగరాజు తదితరులు పాల్గొన్నారు.

మెరుగైన బోధన అందించాలి


సమావేశంలో ఉపాధ్యాయులు, పాఠశాల కమిటీ సభ్యులు

గూడూరు అర్బన్, ఏప్రిల్ 26 (ఆంధ్రజ్యోతి): స్థానిక సరస్వతి శిశుమందిరం పాఠశాలలో విద్యార్థులకు మెరుగైన బోధన అందించాలని పాఠశాల కమిటీ సభ్యులు అన్నారు. శనివారం స్థానిక పూలతోట గిరిజన కాలనీలోని సరస్వతి శిశుమందిరం పాఠశాలలో కమిటీ సభ్యులు ఉపాధ్యాయులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ విద్యార్థులకు దేశభక్తి, దేశసంస్కృతి, సంప్రదాయాలు, కళలు, యోగా తదితర వాటితో పాటు మెరుగైన బోధన అందించాలన్నారు. తద్వారా విద్యార్థులు ఉత్తమ పౌరులుగా ఎదిగేందుకు వీలుంటుందన్నారు. కార్యక్రమంలో యుగంధర్, మురళీరెడ్డి, మయూరి శ్యామ్‌యాదవ్, విశ్వేశ్వరరావు, రంగనాయకులు తదితరులు పాల్గొన్నారు.

అంత్యక్రియలకు ఆర్థిక సాయం


మృతుడి కుటుంబానికి ఆర్థికసాయం అందజేస్తున్న విజయ్‌కుమార్

వాకాడు, ఏప్రిల్ 26 (ఆంధ్రజ్యోతి): మండలంలోని టెంకాయల తోపు గిరిజన కాలనీకి చెందిన బండి మునీంద్ర(27) వడదెబ్బతో శుక్రవారం రాత్రి మృతి చెందాడు. విషయం తెలుసుకున్న మాల మహానాడు రాష్ట్ర ప్రధాన కార్యదర్శి దామా విజయ్‌కుమార్ మృతుడి కుటుంబాన్ని పరామర్శించారు. రూ.5వేలు ఆర్థికసాయం అందజేశారు.

క్రికెట్ ఉచిత శిక్షణ శిబిరం ప్రారంభం

గూడూరు అర్బన్, ఏప్రిల్ 26 (ఆంధ్రజ్యోతి): మండలంలోని చెన్నూరులో ఎన్ఆర్ఐ శశాంక్‌రెడ్డి సహకారంతో క్రికెట్ ఉచిత శిక్షణ శిబిరాన్ని శనివారం ప్రారంభించారు. ఈ సందర్భంగా జీఆర్‌సీసీ సభ్యులు మాట్లాడుతూ 15 ఏళ్ల లోపు ఆటగాళ్లను గుర్తించి వారికి అనుభవం కలిగిన కోచ్‌లతో 45రోజుల పాటు ఉచితంగా క్రికెట్‌లో శిక్షణ అందించడం జరుగుతుందన్నారు. కార్యక్రమంలో రామ్‌గోపాల్, మస్తాన్, అవినాష్, రాజీవ్, దీపక్ తదితరులు పాల్గొన్నారు.

గోకులకృష్ణలో ప్రాంగణ ఎంపికలు

సూళ్లూరుపేట, ఏప్రిల్ 26 (ఆంధ్రజ్యోతి): సూళ్లూరుపేటలోని గోకులకృష్ణ ఇంజనీరింగ్ కళాశాలలో శనివారం శ్రీసిటీలో కిమ్‌బెర్లీ క్లార్క్ మల్టీనేషనల్ కంపెనీ ప్రాంగణ ఎంపికలు నిర్వహించినట్లు ప్రిన్సిపాల్ డాక్టర్ ముచ్చకాల సురేష్ తెలిపారు. కంపెనీ సీనియర్ మేనేజర్లు శ్రీకాంత్, అనుషా ఇంటర్వ్యూలు నిర్వహించారు. డిప్లమో, ఇంజనీరింగ్‌లో వివిధ విభాగాల నుంచి 25 మంది విద్యార్థులు ఇంటర్న్‌షిప్‌కు, ఐదుగురు విద్యార్థులను ఇంజనీరింగ్ అసోసియేట్స్‌గా ఎంపిక చేశారు. ఉద్యోగాలకు ఎంపికైన విద్యార్థులను కళాశాల చైర్మన్ బ్రహ్మయ్య, ప్రిన్సిపాల్, అధ్యాపకులు అభినందించారు.

9న ఎన్‌బీకేఆర్‌లో సృజన సదస్సు


పోస్టర్లు ఆవిష్కరిస్తున్న డైరెక్టర్, విభాగాధిపతులు

కోట, ఏప్రిల్ 26 (ఆంధ్రజ్యోతి): మండల పరిధిలోని విద్యానగర్ ఎన్‌బీకేఆర్ ఇంజనీరింగ్ కళాశాలలో మే 9వ తేదీన జరిగే సృజన 2కే25 జాతీయ స్థాయి సదస్సు నిర్వహించనున్నారు. ఇందుకు సంబంధించిన పోస్టర్లను శనివారం కళాశాల డైరెక్టర్ డాక్టర్ విజయ్ కుమార్‌రెడ్డి, ఆయా విభాగాధిపతులు ఆవిష్కరించారు. సైన్స్ అండ్ హ్యూమానిటీస్ విభాగం ఆధ్వర్యంలో జరిగే ఈ సదస్సుకు దేశంలోని పలు ఇంజనీరింగ్ కళాశాలల నుంచి విద్యార్థులు పాల్గొని ఆవిష్కరణలు చేస్తారు. విద్యార్థుల పేపర్, పోస్టర్ ప్రెజెంటేషన్‌లలో ఉత్తమమైన వాటిని ఎంపిక చేసి బహుమతులు అందజేస్తారు. కార్యక్రమంలో విభాగాధిపతులు డాక్టర్ రవీంద్రారెడ్డి, డాక్టర్ రాధకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

హౌస్ బ్రేకింగ్ కేసులపై దృష్టిపెట్టండి

జిల్లా నేర సమీక్షలో ఎస్పీ ఆదేశం


జిల్లా స్థాయి నేర సమీక్ష సమావేశంలో మాట్లాడుతున్న ఎస్పీ

తిరుపతి(నేరవిభాగం) ఏప్రిల్ 19 (ఆంధ్రజ్యోతి): జిల్లాలో గ్రేవ్ (మర్డర్, దోపిడీలు, రోడ్డుప్రమాదంలో ఎక్కువమంది చనిపోవడం, అత్యాచారాలు, ఫోక్సో కేసులు) కేసుల దర్యాప్తు వేగవంతం చేయాలని, హౌస్ బ్రేకింగ్ కేసులపై ప్రత్యేక దృష్టిసారిం చాలని ఎస్పీ హర్షవర్ధన రాజు ఆదేశించారు. శనివారం తిరుపతిలోని పోలీసు అతిథి గృహంలో జిల్లాస్థాయి నేర సమీక్షా సమావేశం జరిగింది. ఇందులో ప్రధానంగా గ్రేవ్ కేసులు, నాన్ బెయిలబుల్ వారెంట్లు ఎగ్జిక్యూట్ చేయడం, హౌస్ బ్రేకింగ్ కేసులు, మహిళలపై జరుగుతున్న అఘాయిత్యాలపై సమీక్షిం చారు. సబ్ డివిజన్ల వారీగా వున్న కేసుల వివరాలు తెలుసుకుని సరిగా పని చేయని అధికారులపై అసంతృప్తి వ్యక్తం చేశారు. గ్రేవ్ కేసుల పరిష్కారానికి అవసరమైతే ప్రత్యేక టీమ్‌లు ఏర్పాటు చేసుకుని వేగవంతంగా పరిష్కరించాల న్నారు. మిస్సింగ్ కేసులకు సంబంధించి ప్రతి ఫైలునూ పరిశీలించారు. 2021 నుంచి జరిగిన హౌస్ బ్రేకింగ్ కేసులపై ఆరా తీశారు. గూడూరు, నాయుడుపేట, పుత్తూరు సబ్ డివిజన్ల పరిధిలో కేసుల పురోగతిపై వారిని అభినందిం చారు. ఎక్కడైనా రోడ్డు ప్రమాదాలు జరిగినప్పుడు ప్రాణాలు కాపాడేలా ట్రాఫిక్ పోలీసులు పనిచేయాలని సూచించారు. పెండింగ్‌లో ఉన్న నాన్ బెయిలబుల్ వారెంట్లు వెంటనే ఎగ్జిక్యూట్ చేయాలని ఆదేశించారు. ఈ సమావేశంలో ఏఎస్పీలు రామకృష్ణ, రవిమనోహరాచారి, నాగభూషణరావు, వెంకట్రావు, డీఎస్పీలు, సీఐలు, సిబ్బంది పాల్గొన్నారు.

మా గ్రామం వద్ద చెత్త పోయొద్దు

మున్సిపాలిటీ ట్రాక్టర్లను అడ్డుకున్న పెరిమిటిపాడువాసులు

సూళ్లూరుపేట, ఏప్రిల్ 26 (ఆంధ్రజ్యోతి): సూళ్లూరుపేట పట్టణంలో సేకరించిన చెత్తను మున్సిపల్ సిబ్బంది ట్రాక్టర్‌లో తీసుకెళ్లి పెరిమిటిపాడు వద్దనున్న ప్రభుత్వ భూముల్లో పోసేందుకు ప్రయత్నించారు. ఇందుకు గ్రామస్తులు కొందరు అభ్యంతరం చెబుతూ తమ గ్రామ పరిధిలో చెత్త పోయొద్దంటూ ట్రాక్టర్‌ను అడ్డుకొన్నారు. సూళ్లూరుపేట పట్టణంలో ఉన్న డంపింగ్ యార్డులో పది రోజుల క్రితం చెలరేగిన మంటలు ఇంకా పూర్తిగా అదుపులోకి రాలేదు. దీంతో డంపింగ్ యార్డులో చెత్త పోయలేని పరిస్థితి. ఈ నేపథ్యంలో మున్సిపాలిటీ అధికారులు మండల పరిధిలోని పెరిమిటిపాడు సమీపంలోని ముత్యాలమ్మ ఆలయ సమీపంలోని ప్రభుత్వ భూముల్లో చెత్త డంపింగ్ చేసేందుకు రెవెన్యూ అధికారుల నుంచి అనుమతి తీసుకొనేందుకు ప్రయత్నిస్తున్నారు. శనివారం ట్రాక్టర్లు చెత్తను తీసుకెళ్లడంతో ఆ గ్రామస్తులు అడ్డుకున్నారు. దీంతో ట్రాక్టర్లను వెనుదిరిగాయి.

ఉగ్రవాదులను కఠినంగా శిక్షించాలి


పహల్గాం మృతులకు నల్లబ్యాడ్జిలను ధరించి సంతాపం తెలుపుతున్న సునీత సేవాసంస్థ సభ్యులు

గూడూరు, ఏప్రిల్ 26 (ఆంధ్రజ్యోతి): కాశ్మీర్‌లోని పహల్గాం ప్రాంతంలో పర్యాటకులపై మారణకాండకు పాల్పడిన ఉగ్రవాదులను కఠినంగా శిక్షించాలని సునీత సేవాసంస్థ అధ్యక్షుడు సారంగం శ్రీనివాసులు అన్నారు. శనివారం స్థానిక సునీత సేవాసంస్థ కార్యాలయంలో ఉగ్రవాదుల దాడిలో మృతిచెందిన వారికి నివాళులర్పించారు. నల్లబ్యాడ్జీలు ధరించి సంతాపం తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మత సామరస్యానికి ప్రతీకగా అయిన భారతదేశం ఉగ్రవాదులు హిందువులనే లక్ష్యంగా చేసుకుని హతమార్చడం హేయమైన చర్య అన్నారు. కార్యక్రమంలో సంస్థ ప్రధాన కార్యదర్శి సారంగం సులక్ష్మి, మహిళలు పాల్గొన్నారు.

మహిళపై దాడి

ఓజిలి, ఏప్రిల్ 26 (ఆంధ్ర జ్యోతి): ఓజిలి మండలం సగుటూరు వడ్డిపాళెం గ్రామా నికి చెందిన దేవళ్ల అంకమ్మపై అదే గ్రామానికి చెందిన మల్లి పద్మమ్మ, ఆమె భర్తతో పాటు మరో ముగ్గురు దాడి చేసిన ఘటనపై కేసు నమోదు చేసి నట్లు ఎస్ఐ స్వప్న తెలిపారు. ఎస్ఐ కథనం మేరకు.... అంకమ్మ గ్రామంలోని దుకాణం వద్దకు వెళుతుండగా తమను గేలిచేసిందంటూ అదే గ్రామా నికి చెందిన వారు దాడికి పాల్పడ్డారు. ఈ సందర్భంగా బాధితురాలి మెడలోని బంగారు గొలుసు అపహరణకు గురైంది. బాధితురాలి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ తెలిపారు.

ముమ్మరంగా వాహన తనిఖీలు

బాలాయపల్లి, ఏప్రిల్ 26 (ఆంధ్రజ్యోతి) కశ్మీరులోని పహల్గాంలో ఉగ్రదాడుల నేపథ్యంలో మండలంలో పోలీసులు ముమ్మరంగా వాహన తనిఖీలు చేపట్టారు. శనివారం మన్నూరు క్రాస్ రోడ్డు వద్ద ఎస్ఐ గోపి ఆధ్వర్యంలో వాహనాలను తనిఖీ చేశారు.

సరదాతో ప్రాణాల మీదకు తెచ్చుకోవద్దు

గూడూరు, ఏప్రిల్ 26 (ఆంధ్రజ్యోతి): ఈత సరదాతో చిన్నారులు ప్రాణాల మీదకు తెచ్చుకోవద్దని రూరల్ ఎస్ఐ మనోజ్‌కుమార్ అన్నారు. శని వారం మండలంలోని గాంధీ నగర్‌తో పాటు పలు ప్రాం తాల్లోని నీటి గుంతల వద్ద హెచ్చరిక బోర్డులను ఏర్పాటు చేశారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ పాఠశాలలకు సెలవు కావడంతో చిన్నారులు సరదాగా నీటి గుంటలు, బావులు, కాలువల్లోకి ఈతకు వెళుతుంటారన్నారు. నీటి లోతు తెలియక ప్రమాదలకు గురయ్యే అవకాశం ఉందని, తల్లిదండ్రులు తమ పిల్లల పట్ల జాగ్రత్తలు వహించాలన్నారు.

ప్రభుత్వ పాఠ్యపుస్తకాల రవాణా ప్రారంభం


పాఠ్యపుస్తకాల రవాణా ప్రారంభిస్తున్న డీఈవో శేఖర్, ఆర్టీసీ ఏటీఎం రామచంద్రనాయుడు

తిరుపతి(ఆర్టీసీ), ఏప్రిల్ 26(ఆంధ్రజ్యోతి): ఏపీఎస్ ఆర్టీసీ డీజీటీ ద్వారా ప్రభుత్వ పాఠ్యపుస్తకాల రవాణా ప్రక్రియ శనివారం ప్రారంభమైంది. తిరుచానూరు కేంద్రం వద్ద సాయంత్రం డీఈవో శేఖర్, సీటీఎస్ ఏటీఎం రామచంద్రనాయుడు శాస్త్రోక్తంగా పూజలు నిర్వహించారు. అనంతరం కూలీలకు పుస్తకాలను అందించారు. శ్రీకాళహస్తి డివిజన్‌కు సరిపడ పుస్తకాలను డీజీటీ ద్వారా తరలించారు. మొత్తం 14,20,722 పుస్తకాలను మే 15 తేదీ గడువులోగా ఉమ్మడి చిత్తూరు జిల్లాలో మొత్తం 66 మండలాల్లోని ఎమ్మార్సీ సెంటర్లకు చేరవేయనున్నారు.

మహిళల పక్షపాతి ఎన్డీఏ ప్రభుత్వం

తిరుపతి అర్బన్, ఏప్రిల్ 26(ఆంధ్రజ్యోతి): మహిళల సాధికారత కోసం ఎన్డీఏ కూటమి ప్రభుత్వం కృషి చేస్తోందని ఎమ్మెల్యే ఆరణి శ్రీనివాసులు అన్నారు. మహిళలకు ఇచ్చిన ప్రతి హామీని ప్రభుత్వం నెరవేరుస్తోందన్నారు. స్థానిక సీఎస్‌సీ శనివారం ఆయన ఉచిత కుట్టు శిక్షణ కార్యక్రమాన్ని ప్రారంభించారు. బీసీ కార్పొరేషన్, ఈడబ్ల్యూఎస్ ఆధ్వర్యంలో 90 రోజుల శిక్షణకు 360మంది మహిళలు ఎంపికయ్యారు. బీసీ సంక్షేమశాఖ ఈడీ శ్రీదేవి, యాదవ కార్పొరేషన్ చైర్మన్ నరసింహయాదవ్, మాజీ ఎమ్మెల్యే సుగుణమ్మ, డిప్యూటీ మేయర్లు ముద్ర నారాయణ, ఆర్సీ మునికృష్ణ పాల్గొన్నారు.

శ్రీకాళహస్తి
సత్యవేడు

ప్రమాదకరంగా గంగ వంతెన


రక్షణ గోడలు లేని పాలిటెక్నిక్ వెళ్లే దారిలోని వంతెన

సత్యవేడు, ఏప్రిల్ 26 (ఆంధ్రజ్యోతి): మండలంలో గంగ వంతెనల నిర్వహణ నీరుగారుతోంది. చెన్నైకు తాగు నీటిని అందించేం దుకు నాలుగు దశాబ్దాల క్రితం కండలేరు జలాశయం నుంచి పూండి రిజర్వాయర్ వరకు తెలుగు గంగ కాలువ నిర్మించిన విషయం తెలిసిందే. ఈ క్రమంలో గంగ కాలువ నిర్మాణ సమయంలో కాలువపై పలుచోట్ల నిర్మించిన వంతెనలు ప్రస్తుతం ప్రమాదకరంగా మారుతున్నాయి. ఏళ్ళ తరబడి నిర్వహణ పనులు చేపట్టకపోవడంతో మరమ్మతులకు గురయ్యాయి. పట్టణంలోని పాలిటెక్నిక్ వెళ్లే దారిలో ఉన్న వంతెనకు ఇరువైపులా రక్షణ గోడలు కూలి పోయాయి. విద్యార్థులు సహా గ్రామస్తులు ప్రమాదం అంచున ప్రయాణం కొనసాగిస్తున్నారు. అదేవిధంగా రాజగోపాలపురం సమీపంలోని వంతెనకు ఒక వైపు రక్షణ గోడ సగం దెబ్బతింది. ఈ మార్గంలో కంకర క్వారీల నుండి ప్రతిరోజు వందలాది టిప్పర్లు రాకపోకలు సాగిస్తుంటాయి. ఈ క్రమంలో శ్రీసిటీకి వెళ్లే కార్మికులు వంతెన వద్ద టిప్పర్లను తప్పించుకునే క్రమంలో అదుపుతప్పి గాయాలపాలవుతున్నారు. పట్టణంలోని సత్యవేడు - ఊత్తుకోట మార్గంలో మురుగన్ ఆలయ సమీపంలోని వంతెన కింద చెట్లు పెరిగి పోయాయి. సంబంధిత అధికారులు స్పందించాల్సి ఉంది.

1 నుంచి అగస్త్యేశ్వరస్వామి వార్షిక బ్రహ్మోత్సవాలు

నారాయణవనం, ఏప్రిల్ 26(ఆంధ్రజ్యోతి): మండలంలోని కల్యాణ వేంకటేశ్వరస్వామి ఆలయానికి అనుబంధంగా ఉన్న మరగదవల్లీ సమేత అగస్త్యేశ్వరస్వామి వారి ఆలయ వార్షిక బ్రహ్మోత్సవాలు మే 1 నుంచి 10వ తేది వరకు నిర్వహించనున్నట్లు టీటీడీ అధికారులు పేర్కొన్నారు. ఏప్రిల్ 30న సాయంత్రం 6 గంటల నుంచి రాత్రి 8.30 మధ్య గణపతి ఉత్సవం, అంకురార్పణం, మే 1న ఉదయం 7.30 - 9.00 గంటల మధ్య వృషభ లగ్నంలో ధ్వజారోహణం నిర్వహిస్తారు. అదే రోజు రాత్రి 7.30 గంటలకు చంద్రప్రభ వాహనంపై అగస్త్యేశ్వరస్వామి భక్తులకు దర్శనమిస్తారు. ప్రతిరోజు ఉదయం 10నుంచి 11 గంటల మధ్య స్వామివారి ఉత్సవ మూర్తులకు స్నపన తిరుమంజనం నిర్వహి స్తారు. ప్రతిరోజు రాత్రి 7.30 గంటలకు స్వామి వారి వాహన సేవలుంటాయి. మే 2న సింహ వాహనం, 3న హంసవాహనం, 4న శేషవాహనం, 5న నంది వాహనం, 6న గజవాహన సేవలుంటాయి. మే 7న రథోత్సవం, 8న కల్యాణోత్సవం, రాత్రి అశ్వవాహనం, మే 9న నటరాజస్వామికి అభిషేకం, వీధి ఉత్సవం జరుగుతాయి. రాత్రి 7 గంటలకు రావణేశ్వర వాహనంపై స్వామివారి దివ్యదర్శనం ఉంటుంది. మే 10వ తేది త్రిశూలం స్నానం, రాత్రి ధ్వజావరోహణంతో బ్రహ్మోత్సవాలు ముగుస్తాయి.

భాష్యకారుల గ్రామోత్సవం



నారాయణవనం, ఏప్రిల్ 26(ఆంధ్రజ్యోతి): పట్టణంలోని పద్మావతి సమేత కల్యాణ వెంకన్న ఆలయంలో భాష్యకారుల ఉత్సవాలు వైభవంగా నిర్వహిస్తున్నారు. శనివారం ఉత్సవాల్లో భాగంగా ఉదయం నిత్య పూజా కైంకర్యాలు, ప్రత్యేక పూజలు నిర్వహించారు. సాయంత్రం భాష్యకారులు తిరుచ్చి వాహనంపై మాడవీధుల్లో విహరించారు. ఆలయాధికారి నాగరాజు, సిబ్బంది పాల్గొన్నారు.

రాష్ట్రస్థాయి సమీక్షకు కాంగ్రెస్ నేతలు



శ్రీకాళహస్తి, ఏప్రిల్ 26(ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో కాంగ్రెస్ పునర్నిర్మాణం కోసం విజయవాడలో జరిగిన సమీక్షలు తిరుపతి నేతలు హాజరయ్యారు. నగరంలోని ఏ1 కన్వెన్షన్ సెంటర్‌లో శనివారం పీసీసీ అధ్యక్షురాలు షర్మిల ఆధ్వర్యంలో జరిగిన సమీక్షకు శ్రీకాళహస్తి నియోజకవర్గ పార్టీ సమన్వయకర్త టి.దామోదర్‌రెడ్డి నాయకులతో కలిసి హాజరయ్యారు. పార్టీని ప్రజలకు ఏ విధంగా చేరువ చేయాలనే అంశాలపై సమీక్షించినట్టు తెలిపారు.

ఆగమోక్తంగా శనీశ్వరస్వామికి తైలాభిషేకం



శనీశ్వరస్వామికి అభిషేకం చేస్తున్న అర్చకుడు - ప్రత్యేక అలంకారంలో శనీశ్వరస్వామి

శ్రీకాళహస్తి, ఏప్రిల్ 26(ఆంధ్రజ్యోతి): శ్రీకాళహస్తీశ్వరాలయంలో కొలువై ఉన్న శనీశ్వరస్వామికి శనివారం ఆగమోక్తంగా పూజలు నిర్వహించారు. స్వామి అమ్మవార్ల అభిషేకం అనంతరం శనీశ్వరస్వామి సన్నిధిలో కలశ ప్రతిష్ఠ చేసి మొదట గణపతి, కలశ పూజలను చేశారు. అనంతరం స్వామివారికి నువ్వుల నూనె, పాలు, పెరుగు, చందనం, నారికేళ, కలశ జలాలతో అభిషేకించారు. అనంతరం స్వామివారిని పలు పుష్పాలతో విశేషంగా అలంకరించి ధూప, దీప నైవేద్యాలు సమర్పించారు. శని త్రయోదశి కావడంతో భక్తులు పెద్దసంఖ్యలో పాల్గొని స్వామివారిని దర్శించుకున్నారు.

గ్రేవ్ కేసుల దర్యాప్తు వేగవంతం చేయండి: ఎస్పీ


సిబ్బందికి దిశానిర్దేశం చేస్తున్న ఎస్పీ

తిరుపతి(నేరవిభాగం) ఏప్రిల్ 26(ఆంధ్రజ్యోతి): జిల్లాలో గ్రేవ్ (మర్డర్లు, దోపిడీలు, రోడ్డుప్రమాదంలో ఎక్కువమంది చనిపోవడం, అత్యాచారాలు, పోక్సో కేసులు) కేసుల దర్యాప్తు వేగవంతం చేయాలని, హౌస్ బ్రేకింగ్ కేసులపై ప్రత్యేక దృష్టి సారించాలని ఎస్పీ హర్షవర్ధన రాజు ఆదేశించారు. శనివారం తిరుపతిలోని పోలీసు అతిథి గృహంలో జిల్లాస్థాయి నేర సమీక్షా సమావేశం జరిగింది. ఇందులో నాన్ బెయిలబుల్ వారెంట్లు మహిళలపై జరుగుతున్న అఘాయిత్యాలపై సమీక్షించారు. సబ్ డివిజన్ల వారీగా కేసుల వివరాలు తెలుసుకుని సరిగా పని చేయని అధికారులపై అసంతృప్తి వ్యక్తం చేశారు. గ్రేవ్ కేసుల పరిష్కారానికి అవసరమైతే ప్రత్యేక టీమ్‌లు ఏర్పాటు చేసుకుని వేగవంతంగా పరిష్కరించాలన్నారు. మిస్సింగ్ కేసులకు సంబంధించి ప్రతి ఫైలునూ పరిశీలించారు. 2021 నుంచి జరిగిన హౌస్ బ్రేకింగ్ కేసులపై ఆరా తీశారు. గూడూరు, నాయుడుపేట, పుత్తూరు సబ్ డివిజన్ల పరిధిలో కేసుల పురోగతిపై వారిని అభినందించారు. ఎక్కడైనా రోడ్డు ప్రమాదాలు జరిగిన ప్పుడు ప్రాణాలు కాపాడేలా ట్రాఫిక్ పోలీసులు పనిచేయాలని సూచించారు. ఏఎస్పీలు రామ కృష్ణ, రవిమనోహరాచారి, నాగభూషణరావు, వెంకట్రావు, డీఎస్పీలు, సీఐలు, సిబ్బంది పాల్గొన్నారు.

పుత్తూరు వార్తలు

వైభవంగా శ్రీవారి గ్రామోత్సవం



వడమాలపేట,ఏప్రిల్ 26 (ఆంధ్రజ్యోతి): మండలంలోని అప్పలాయగుంటలో కొలువై ఉన్న ప్రసన్న వేంకటేశ్వరస్వామి ఆలయంలో శనివారం శ్రీవారి గ్రామోత్సవం, ఊంజల సేవ వైభవంగా నిర్వహించారు. ఉదయం సుప్రభాతసేవతో స్వామివారిని మేల్కొలిపి నిత్య కైంకర్యాలు నిర్వహించారు. సాయంత్రం ఉభయ నాంచారులతో శ్రీవారిని సర్వాభరణాలు, పూలమాలలతో అలంకరించి వేదమంత్రాలు, భక్తుల గోవింద నామస్మరణల నడుమ శ్రీవారి ఊంజల సేవ నిర్వహించారు. అనంతరం సర్వాలంకార భూషితులైన పద్మావతి, ఆండాల్ సమేత ప్రసన్న వేంకటేశ్వరస్వామిని మేళతాళాలు,మంగళ వాయిద్యాలు నడుమ మాడ వీధుల్లో ఊరేగించారు. భక్తులు నారికేళ,కర్పూర నీరాజనాలు సమర్పించారు. అనంతరం ఆలయానికి చేరుకున్న స్వామిఅమ్మవార్లకు మంగళహారతులిచ్చారు. ఆలయ అధికారి శివకుమార్ ఏర్పాట్లను పర్యవేక్షించారు.

పోలీసుల తనిఖీలు

రేణిగుంట, ఏప్రిల్ 26 (ఆంధ్రజ్యోతి) : రేణిగుంట - కడప మార్గంలోని కట్ట పుట్టాలమ్మ ఆలయం వద్ద శనివారం సాయంత్రం అర్బన్ సీఐ శరత్‌చంద్ర ఆధ్వర్యంలో సిబ్బంది వాహనాలను తనిఖీ నిర్వహించారు. ఉగ్రవాదుల దాడుల నేపథ్యంలో తనిఖీలు నిర్వహించినట్టు ఎస్ఐ అరుణ్ కుమార్ చెప్పారు.

సూళ్లూరుపేట రోడ్డుకు మోక్షం కలిగేనా?

తూతూమంత్రంగా మరమ్మతులు ● డిప్యూటీ సీఎం ఆదేశాలు పట్టించుకోని అధికారులు ● ఇబ్బంది పడుతున్న వాహనదారులు





సీసీఎల్ పరిశ్రమ సమీపంలో దుస్థితిలో ఉన్న రోడ్డు - మతకాముడి, గాజులపెళ్లూరు దగ్గర రోడ్డుకు పడిన గుంతలు - సాధనవారిపాళెం దగ్గర కోతకు గురైన రోడ్డు

బుచ్చినాయుడుకండ్రిగ, ఏప్రిల్ 26 (ఆంధ్రజ్యోతి): డిప్యూటీ సీఎం చెప్పారు... రోడ్డు బాగు పడలేదు... కలెక్టర్ ఆదేశించారు... అయినా రోడ్డుకు మోక్షం కలగలేదు. ఇదీ బుచ్చినాయుడుకండ్రిగ నుంచి సూళ్లూరుపేటకు వెళ్లే రోడ్డు దుస్థితి. వైసీపీ ప్రభుత్వ హయాంలో బీఎన్‌కండ్రిగ నుంచి సూళ్లూరుపేట వరకు డబుల్ రోడ్డుకు అప్పటి మంత్రి పెద్దిరెడ్డి 2021లో శంకుస్థాపన చేశారు. సూళ్లూరుపేట నుంచి పెరిటిపాడు వరకు డబుల్ రోడ్డు పనులు చేపట్టారు. బీఎన్‌కండ్రిగ నుంచి పెరిటిపాడు వరకు బ్రిడ్జి నిర్మాణాలు చేపట్టి బిల్లులు రాకపోవడంతో కాంట్రాక్టర్ పనులను నిలిపివేశారు. దీంతో రోడ్డు గుంతలమయమై అధ్వానంగా మారింది. గత ఏడాది ఆగస్టులో డిప్యూటీ సీఎం పవన్‌కల్యాణ్ షార్‌లో జరిగిన కార్యక్రమానికి బుచ్చినాయుడుకండ్రిగ, సూళ్లూరుపేట మీదుగా వెళ్లారు. రోడ్డు పరిస్థితి చూసి పక్కనే ఉన్న కలెక్టర్‌ను నాలుగు రోజుల్లో మరమ్మతులు చేయించాలని కోరారు. అయితే సంబంధిత అధికారులు రోడ్డుకు ఇరువైపులా మట్టి తోలి చదును చేసి చేతులు దులుపుకున్నారు. ప్రస్తుతం రోడ్డు పూర్వస్థితికి చేరుకుంది. సూళ్లూరుపేట, వరదయ్యపాళెం మండలాల పరిధిలో వందల సంఖ్యలో పరిశ్రమలు స్థాపించడంతో వాహనాల రద్దీ విపరీతంగా పెరిగింది. దీంతో ఈ రోడ్డుతో వాహనదారులకు ఇబ్బందులు తప్పడం లేదు. గత ఏడాది డిసెంబరులో కురిసిన భారీ వర్షాలకు రోడ్డు కోతకు గురై రాకపోకలకు ఇబ్బంది కలుగుతోంది. ఇప్పటికైనా సంబంధిత అధికారులు చర్యలు తీసుకుని సూళ్లూరుపేట డబుల్ రోడ్డు పనులు చేపట్టాలని మండలవాసులు కోరుతున్నారు.

30 వరకు స్కౌట్స్ శిక్షణ

కేవీబీపురం, ఏప్రిల్ 26(ఆంధ్రజ్యోతి): తిరుపతి జిల్లాలోని 20 మండలాల స్కౌట్స్‌కు కేవీబీపురం మండలంలోని ఆదర్శ, కేజీబీవీ పాఠశాలల్లో శనివారం స్కౌట్స్ అండ్ గైడ్స్ పెట్రోల్ శిక్షణ శిబిరం ప్రారంభమైందని ఏఎంవో శివశంకర్ చెప్పారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ 30వ తేదీ వరకు జరిగే శిబిరంలో బాలికలు, బాలురకు స్కిల్స్ డెవలప్‌మెంట్‌పై అవగాహన కల్పిస్తారన్నారు. తిరుపతి జిల్లా ఇన్‌ఛార్జి కార్యదర్శి విజయకుమార్, జిల్లా ట్రైనింగ్ కమిషనర్ సావిత్రి, జిల్లా యువజన చైర్మన్ అజారుద్దీన్ తదితరులు పాల్గొన్నారు.

ప్రభుత్వ పాఠ్యపుస్తకాల రవాణా ప్రారంభం

తిరుపతి(ఆర్టీసీ), ఏప్రిల్ 26(ఆంధ్రజ్యోతి): ఏపీఎస్ ఆర్టీసీ డీజీటీ ద్వారా ప్రభుత్వ పాఠ్యపుస్తకాల రవాణా ప్రక్రియ శనివారం ప్రారంభమైంది. తిరుచానూరు కేంద్రం వద్ద సాయంత్రం డీఈవో శేఖర్, సీటీఎస్ ఏటీఎం రామచంద్రనాయుడు శాస్త్రోక్తంగా పూజలు నిర్వహించారు. అనంతరం కూలీలకు పుస్తకాలను అందించారు. శ్రీకాళహస్తి డివిజన్‌కు సరిపడ పుస్తకాలను డీజీటీ ద్వారా తరలించారు. మొత్తం 14,20,722 పుస్తకాలను మే 15 తేదీ గడువులోగా ఉమ్మడి చిత్తూరు జిల్లాలో మొత్తం 66 మండలాల్లోని ఎమ్మార్సీ సెంటర్లకు చేరవేయనున్నారు.

భారత్‌లో ఉగ్రవాదానికి చోటు లేదు



జనసేన, జీఎంపీ సభ్యుల ఆధ్వర్యంలో జరిగిన నిరసన ర్యాలీలు

శ్రీకాళహస్తి, ఏప్రిల్ 26(ఆంధ్రజ్యోతి): భారతదేశంలో ఉగ్రవాదానికి చోటు లేదని జనసేన ఉమ్మడి జిల్లా కార్యదర్శి కొట్టే సాయి అన్నారు. పహల్గాంలో ఉగ్రదాడికి నిరసనగా శనివారం సాయంత్రం పట్టణంలో అన్ని మతాల వారితో ర్యాలీ నిర్వహించి మానవ హారం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పహల్గాం ఉదంతం మానవత్వంపై జరిగిన దాడిగా అభివర్ణించారు. దేశంలోని అన్ని మతాల ప్రజలు ఈ దాడులను ఖండించడంతో భిన్నత్వంలో ఏకత్వానికి నిదర్శనమన్నారు. కుమార్, మహేష్, చంద్ర, తులసి, ముస్లిం మతపెద్దలు లాలూ, అబ్దుల్ కలాం, అన్వర్ ముయిాద్, శ్రీకాహస్తి పాస్టర్స్ వెల్ఫేర్ అసోసియేషన్ అధ్యక్షుడు పాస్టర్ అంబ్రోస్, కార్యదర్శి రవి డానియేల్, సుందరరాజు తదితరులు పాల్గొన్నారు.

● పహల్గాంలో పర్యాటకులను ఉగ్రవాదులు చంపడం హేయమైన చర్య అని శ్రీకాళహస్తి డివిజన్ జీఎంపీ సభ్యులు అన్నారు. శనివారం పట్టణంలోని పెండ్లిమండపం వద్ద కొవ్వొత్తుల ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఉగ్రవాదాన్ని కూకటి వేళ్లతో నిర్మూలించాలన్నారు. ఏడుకొండలు, శివశంకర్, సురేష్‌రెడ్డి, వెంకటేశ్వర్లు, బాలాజీ, వీరయ్య తదితరులు పాల్గొన్నారు.

ఎస్సీ కార్పొరేషన్ రుణాలకు దరఖాస్తుల ఆహ్వానం

పిచ్చాటూరు, ఏప్రిల్ 26(ఆంధ్రజ్యోతి): ఎస్సీ కార్పొరేషన్ ద్వారా ప్రభుత్వం అందిస్తున్న సబ్సిడీ రుణాల కోసం అర్హులైన వారు ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవాలని ఎంపీడీవో మహ్మద్‌రఫి తెలిపారు. 21 సంవత్సరాల నుంచి 50 సంవత్సరాలు కలిగిన ఎస్సీ, ఎస్టీలకు చెందిన వారు రుణాలకు అర్హులన్నారు. మే 10వ తేదీ లోపు ఆన్‌లైన్‌లో నమోదు చేసుకోవాలన్నారు.

ఉమామహేశ్వరస్వామి ఆలయ వార్షికోత్సవం


పూజల్లో పాల్గొన్న భక్తులు

సత్యవేడు, ఏప్రిల్ 26 (ఆంధ్రజ్యోతి): మండలంలోని ఇరుగుళంలో ఉమామహేశ్వరస్వామి ఆలయ మొదటి వార్షికోత్సవాలు ఘనంగా నిర్వహించారు. ఆలయ పునరుద్ధరణ జరిగి ఏడాది పూర్తయిన సందర్భంగా ఆలయ ధర్మకర్త, ఎంపీపీ సుశీల్‌కుమార్ రెడ్డి ఆధ్వర్యంలో శనివారం పూజలు జరిపారు. ఆలయ ప్రాంగణంలో రెండు ప్రధాన కలశాలను ప్రతిష్ఠించి స్వామివారికి విశేష పూజలు నిర్వహించారు. అంతకు ముందు ప్రధాన కలశాల వద్ద శుద్ధ జలాలతో నిండిన 108 కలశ శంకువులను ప్రతిష్ఠించి పూజలు, హోమం జరిపారు. అనంతరం స్వామి వారిని వివిధ పుష్పాలతో అందంగా అలంకరించి, మహా హారతి సమర్పించారు. తీర్థ ప్రసాద వినియోగం జరిగింది.

ఏడుగంగమ్మల ఆలయానికి బీరువా వితరణ

శ్రీకాళహస్తి, ఏప్రిల్ 26(ఆంధ్రజ్యోతి): శ్రీకాళహస్తీశ్వరాలయానికి అనుబంధంగా ముత్యాలమ్మ గుడివీధిలో కొలువై ఉన్న ఏడుగంగమ్మల ఆలయానికి శనివారం సూళ్లూరుపేట మండలం మన్నారుపోలూరుకు చెందిన గిరిజ, కాంతమ్మ, గోపాలయ్య జ్ఞాపకార్థం బీరువాను అందజేశారు. ఆలయ అర్చకుడు మణికంఠ స్వీకరించి దాతకు కృతజ్ఞతలు తెలిపారు.

వారపు సంతలో కానరాని వసతులు


అస్తవ్యస్తంగా ఏర్పాటు చేసిన దుకాణాలు

రేణిగుంట, ఏప్రిల్ 26 (ఆంధ్రజ్యోతి): పట్టణంలోని వారపు సంత అస్తవ్యస్తంగా తయారైంది. సంత లోపలికి వాహనాలు రాక పోకలు కొనసాగిస్తుండడంతో సమస్య తలెత్తుతోంది. సంతలో రోడ్డుపైన తాత్కాలిక దుకాణాలను తొలగిస్తామని, ద్విచక్ర వాహ నాలను, ఆటోల రాకపోకలను నిషేధిస్తామని పంచాయతీ అధికారుల ఆదేశాలు అమలు కావడం లేదు. దీంతో రైల్వే గేటుకు రెండు పక్కల వాహనాలు నిలబడిపోతున్నాయి. గేటు వేస్తే వాహనదారులు అల్లాడిపో తున్నారు. ఇప్పటికైనా పంచాయతీ అధికారులు చర్యలు తీసుకోవాల్సి ఉంది.

నేడు వైద్య శిబిరం

కేవీబీపురం, ఏప్రిల్ 26(ఆంధ్రజ్యోతి): మండల కేంద్రంలోని జడ్పీ ఉన్నత పాఠశాలలో రష్ మల్టీ స్పెషాలిటీ ఆధ్వర్యంలో ఉదయం 9గంటల నుంచి మధ్యాహ్నం 2 వరకు వైద్య శిబిరం జరుగుతుందని ఆస్పత్రి పీఆర్వో సుబ్రహ్మణ్యం తెలిపారు. ఈ సందర్భంగా కడుపు, నడుము, వెన్నెముక నొప్పులు, మొలలు, హెర్నియా, షుగర్, బీపీ వంటి వాటికి పరీక్షలు నిర్వహించి అవసరమైన వారికి ఉచితంగా మందులు పంపిణీ చేయనున్నట్లు తెలిపారు.

జానపద జాతరకు ఉపాధ్యాయుడికి ఆహ్వానం

వరదయ్యపాళెం, ఏప్రిల్ 26(ఆంధ్రజ్యోతి): మన పల్లె జానపద జాతరకు జానపద కళాకారులు పోలూరు జగన్నాథంకు ఆహ్వానం అందింది. తిరుపతి వెంకటేశ్వర విశ్వవిద్యాలయంలో తెలుగు సాహిత్య సాంస్కృతిక వేదిక, డైరెక్టరేట్ ఆఫ్ స్టూడెంట్స్ వెల్ఫేర్ అండర్ కల్చరల్ అఫైర్స్ ఆధ్వర్యంలో మే 9, 10 తేదీల్లో మన పల్లె జానపద జాతర జరగనుంది. ఈ సంబరాల్లో పాల్గొనేందుకు ఉపాధ్యాయుడు, కవి, జానపద కళాకారులు జగన్నాథంకు ఆహ్వానం అందింది.

టీడీపీ నాయకుడి కుటుంబానికి పరామర్శ

శ్రీకాళహస్తి, ఏప్రిల్ 26(ఆంధ్రజ్యోతి): పట్టణానికి చెందిన టీడీపీ సీనియర్ నాయకుడు మునీంద్రబాబు ఇటీవల మరణించాడు. శనివారం శ్రీకాళహస్తి ఎమ్మెల్యే బొజ్జల సుధీర్‌రెడ్డి తల్లి బృందమ్మ మునీంద్రబాబు స్వగృహానికి చేరుకుని కుటుంబ సభ్యులను పరామర్శించారు. కుటుంబానికి అండగా ఉంటామని భరోసా ఇచ్చారు. ఈ కార్యక్రమంలో చెంచయ్యనాయుడు, మిన్నల రవి, ఉమేష్‌రావు తదితరులు పాల్గొన్నారు.

రేపటినుంచి వ్యవసాయ విద్యుత్ సరఫరా వేళల్లో మార్పు

రేణిగుంట, ఏప్రిల్ 26 (ఆంధ్రజ్యోతి): రేపటి నుంచి వ్యవసాయ విద్యుత్ సరఫరా సమయాల్లో మార్పు చేస్తున్నట్టు ట్రాన్స్‌కో డీఈఈ రమేష్ బాబు తెలిపారు. ఈనెల 28న సోమవారం నుంచి ఏ గ్రూపు ఫీడర్ పరిధిలో ఉన్న కరకంబాడి, గుత్తివారిపల్లి, అల్లికేశం, పిల్లపాళెంకు ఉదయం 7 గంటలకు, బీ గ్రూపులోని వెంకటాపురం, మల్ల వరం, అత్తూరు, జీపాలెంలకు ఉదయం 9 గంటల నుంచి సరఫరా జరుగుతుందన్నారు.

మేడేను జయప్రదం చేయండి


కరపత్రాలను ఆవిష్కరిస్తున్న ఏఐటీయూసీ నాయకులు

శ్రీకాళహస్తి, ఏప్రిల్ 26(ఆంధ్రజ్యోతి): మేడేను జయప్రదం చేయాలని ఏఐటీయూసీ డిస్కం నాయకుడు జైముని అన్నారు. శనివారం సబ్‌స్టేషన్ వద్ద కరపత్రాలను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్యుత్ రంగ ప్రైవేటీకరణకు వ్యతిరేకంగా మేడే స్ఫూర్తితో పోరాటాలకు సన్నద్ధం అవుదామన్నారు. ఉద్యోగులు, కార్మికుల సమస్యల పరిష్కారం కోసం కార్మిక హక్కులను కాలరాసే 4 కార్మిక చట్టాలను రద్దు చేసే వరకు పోరాడుదామని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో సీపీఐ నాయకులు జనమాల గురవయ్య, రొడ్డ గోపి, శ్రీధర్ తదితరులు పాల్గొన్నారు.